# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 36 సంచిక 5

పేజీలు 40

జనవరి 2017

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ....................2
శ్రీబాబూజీ ఉవాచ....................4
అమ్మమాట....................7
భగవత్ప్రాప్తికి సాధనము ....................9
చిదగ్నికుండ సంభూతా ....................11
సంక్రాంతి ....................12
కార్తీక దామోదరా! కాళీప్రసాదా! ....................14
సత్యగురుదేవులు-నకిలీగురువులు....................16
అవతార్ శ్రీమెహర్‌బాబా ఆధ్యాత్మిక సందేశము....................18
న గురోరధికం - శివశాసనతః ....................20
రాగద్వేషాలు ....................22
యోగవాశిష్ఠము ....................24
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................26
పరిప్రశ్న ....................27
ధాధ్యాస ధ్యానము ....................29
అనింద్యునిపై గణపతి విజయం ....................31
శ్రీకృష్ణకర్ణామృతము....................33
వశిష్ఠుడు....................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర....................37
విష్ణు కథలు- మీరాబాయి....................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

వివిక్త దేశేచ సుఖాసమస్థః ।
శుచిః సమగ్రీవశిరః శరీరః ।
అత్యాశ్రమస్థః సకలేంద్రియాణి ।
నిరుధ్య భక్త్యా స్వగురుం ప్రణమ్య ।
హృత్పుండరీకం విరజం విశుద్ధం ।
విచిన్త్యమధ్యే విశదం విశోకం ॥

(కైవల్యోపనిషత్తు 5వ శ్లో॥)

ఆత్మసాక్షాత్కారం పొందటానికి అనువైన జీవన విధానం రూపొందించుకునే ప్రక్రియలలో ధ్యాన మార్గము యొక్క విశిష్టతను తెలియజేసే మంత్రాలు యీ ఉపనిషత్తు విశదీకరిస్తోంది. మానవ జీవితానికి మూలకారణమును తెలియజేసే ఆత్మవిద్య ఆత్మవిచారణ ద్వారా మాత్రమే సాధ్యపడుతుందనేది స్పష్టము.

ఆత్మవిచారణకు అవరోధంగా ఉండే మనస్సు విక్షేపాలు, అలజడులు ధ్యానమార్గంలో ఏకాగ్రతకు భంగం కలిగిస్తాయి. కాబట్టి మనస్సులో ప్రశాంతత ఆత్మవిచారణకి అవశ్యము. అంతేకాకుండా మనస్సులో కలిగే సంకల్పాలు, బుద్ధిలో కలిగే ఆలోచనలను కూడా నిరోధించాలి. దీనికి ఏకాంత ప్రదేశము ఎంపిక చేయక తప్పదు. శరీరానికి శ్రమ కలగకుండా మనస్సుకి ప్రశాంతతను చేకూర్చే ఆసనమే సుఖాసనము. శరీరాన్ని, అవయవాలను బిగపట్టకుండా, విశ్రాంతిగా కూర్చున్నప్పుడే మనస్సులో ఆత్మవిచారణ ప్రశాంతంగా జరగటానికి సావకాశం కుదురుతుంది.

బాహ్యమాలిన్యాలను త్యజించటమేకాక హృదయమాలిన్యాలైన రాగద్వేషాలు, ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనము లాంటివి కూడా తుడిచి వేసుకోవాలి. అప్పుడే ధ్యానంలో మనస్సు, భక్తి, ప్రేమ మార్గంలో పయనించే అవకాశం కలుగుతుంది.

సాధకుడు మనస్సును ఏకాగ్రపరచటమే నిజమైన సన్యాసము. మనస్సు విషయభోగాలవైపు పరుగులెత్తటం, ఇదివరలో తాను అనుభవించినవాటిని గుర్తుకుతెచ్చుకుని, తిరిగి వాటిని పొందాలని వాంఛించటం లాంటివి నిరోధించటమే సన్యాసము.

అంతేకాదు మనస్సు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు దాస్యం చేస్తుంది. వాటి నుంచి మనస్సుని మళ్ళించటమే సర్వేంద్రియాణి నిరుధ్య అనిచెప్పవచ్చు. పైన చెప్పినవి అన్నీ సాధించగల సమర్థత సాధకునికి ఉందా! అసంభవం. ఎలాగైతే నదీ ప్రవాహాన్ని తీర్చిదిద్దటానికి కరకట్ట తోడ్పడుతుందో, అలాగే గురూపదేశము సాధకుని హృదయంలో కరుణ, ప్రేమ, క్షమ, దయ, సహనంతో కూడిన భక్తిభావాన్ని పెంపొందింపజేసి, విరజం విశుద్ధం, విశోకం, విశదంతో కూడిన పరతత్త్వాన్ని అందుకోవటానికి తోడ్పడే ధ్యాన మార్గాన్ని సుగమం చేస్తుంది.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జనవరి 2017, ఫిబ్రవరి 2017 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

జనవరి 2017: AS 0405, 2421, 2631,4869, 4952, 5127, 5414, 5490, 6327,
AS 6454, 6478, 6508, 6509, 6514, 6515, 6516, 6824, 6825,
AS 6990, 6992, 7206 to 7216, 6823

ఫిబ్రవరి 2017: AS 3702, 5753, 5833, 6032, 6280, 6518, 6520, 7056, 7223
AS 7227, 7228, 7235

– మేనేజర్

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ 'గురోరన్యం న భావయేత్' అంటే అర్థమేమిటి? అని భక్తులను ప్రశ్నించి బోధను కొనసాగిస్తూ "తాను ఆశ్రయించిన గురుమూర్తియందు అచంచల విశ్వాసముతో, భక్తిశ్రద్ధలతో ఆయన ప్రసాదించిన లక్ష్యార్థమును అనుక్షణము స్మరణచేస్తూ, ధ్యానిస్తూ గురువాక్య పాలన చేసేవారికి తాము ఆశ్రయించిన గురుమూర్తియే సర్వేశ్వరుడై, సర్వవ్యాపకుడై, సర్వరక్షకుడై, సర్వశక్తి సంపన్నుడై తమను ఉద్ధరించగల సమర్థుడు అనే భావం అరూఢమై తమను తాము సర్వసమర్పణ చేసుకోవడమే దాని అర్థం.



మానవుడు దేహం నేననే అజ్ఞానంతో గ్రంథాలు చదువుతాడు, శాస్త్రవాసన ప్రేరణ చేస్తుంది. పుణ్యం చేస్తే మంచిది అని శాస్త్రాలు చెబుతున్నాయి కదా! అని సత్కర్మలు చేస్తాడు. కానీ ఏమీ లాభం? జనన మరణ విషవలయం నుండి విముక్తిని పొందలేడు. ప్రాపంచిక లౌకిక వ్యవహారములలో చిక్కుకుంటాడు. ఆశ అనే మొసలి సంసార సాగరంలో దాగి ఉంటుంది. సమయం కోసం వేచియుండి, జీవుడే దానికి ఆహారం కాబట్టి జీవుడు దొరికితే వదలదు. ఆశ అనే మొసలి నోటిలో చిక్కుకున్న జీవికి విముక్తి కలగడం దుర్లభం. ఆశ నశించనిదే విముక్తి కలగదు. గజేంద్రుడు చూడండి తియ్యటినీరు త్రాగుదామనే ఆశతో సరస్సులో ప్రవేశించాడు. నీరు త్రాగిన తరువాత దాహం తీరలేదు. సంతృప్తి కలగలేదు. ఆ సరస్సంతా విచ్చలవిడిగా తిరిగాడు. తన ప్రియురాండ్రతో సరసల్లాపములు జరిపాడు. తాను పొందిన సుఖానికి సంతృప్తి చెందలేదు. ఇంకా సుఖాన్ని పొందాలని ఆశపడ్డాడు. మొసలి నోటిలో చిక్కుకున్నాడు. సుఖము పొందకపోగా దుఃఖానికి గురి అయ్యాడు. అంతవరకు తనను ప్రేమించిన బంధు, మిత్రాదులెవ్వరూ

రక్షించలేకపోయారు.

అప్పుడు జ్ఞానోదయమయింది. సృష్టి, స్థితి, లయకారకుడు జగద్రక్షకుడు అయిన పరమాత్ముడొక్కడే తనను రక్షించగలిగినవాడు అని గ్రహించాడు. తీవ్ర ఆవేదన చెందాడు. గురుకృప అనే చక్రధారి జీవుని ఆశ అనే మొసలిని సంహరించి ఆశాపాశము నుండి విముక్తిని ప్రసాదించాడు. ఆ జీవుడు శాంతించి తన స్వరూపమేమిటో తెలుసుకున్నాడు.

ప్రతి సాధకుడు ముందుగా తన కర్తవ్యం ఏమిటో తెలుసుకోవాలి. తాను సద్గురుమూర్తిని ఎందుకు ఆశ్రయించవలసి వచ్చింది? ఆశ్రయించి ప్రయోజనం పొందటానికి తగిన ప్రయత్నం చేస్తున్నానా? నేను. నిజమైన స్వేచ్ఛ అంటే జనన మరణమనే బంధనుండి విముక్తి పొందినపుడే నిజమైన స్వేచ్ఛ అని గ్రహించాలి. నీ దారాపుత్రాదులుగానీ, నీ బంధుమిత్రులు గానీ నీకు బంధవిముక్తిని ప్రసాదించలేరు. దానిని ప్రసాదించ గల్గినది సద్గురుమూర్తి మాత్రమే అని గ్రహించాలి.

నీకు బంధవిముక్తి కలగాలంటే గురువుతో అనుబంధాన్ని పెంచుకోవాలి. సద్గురుమూర్తి ఆశ్రయంలోనే ఉండాలి. అప్పడే 'గురోరన్యం న భావయేత్' అన్నది కార్యరూపం దాలుస్తుంది. అంతేగాని వాచా వేదాంతము పనికిరాదు. గురుమూర్తి చేసిన బోధని శ్రద్ధగా వినడమే గాక విచారణ చేయటం వలన అది మననమునకు వచ్చి మరపు అనేది అదృశ్యమవుతుంది. సాధకులు కడు జాగ్రత్త వహించవలసినది ఇంకొకటి ఉంది. అది మాయాశక్తి. మాయ చాలా గొప్పది. అనుక్షణం జీవుడిని వెంటాడుతూ బోల్తా కొట్టిస్తుంది. దూషణలతో మనస్సుని కృంగదీసి, భూషణలతో పొంగిపోయేటట్లు చేస్తుంది. సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమును ఎప్పడు సాధిస్తామా? నిత్యానందాన్ని ఏ క్షణంలో రుచిచూస్తామా? అనే తీవ్ర ఆవేదన చెందిన సాధకుడు మాయా ప్రభావానికి లోనుకాడు. అగ్నిలో బంధింపబడిన పిల్లి ఏ విధంగా తప్పించుకోవటానికి ప్రయత్నిస్తుందో అంతటి తీవ్ర ఆవేదన చెందాలి. అదే సద్గురుమూర్తికి శిష్యుడు సమర్పించే కానుక అన్నారు.

ఇంకా మాట్లాడుతూ సాధకులు ఎలా ఉంటారో మీకొక దృష్టాంతము చెబుతాను. వివేకవంతులైన ఉప్పబొమ్మలాంటి సాధకులు సద్గురుమూర్తి చేసిన బోధని శ్రద్ధగా శ్రవణం చేస్తారు. మనస్సు బోధలో లీనమైపోతుంది. వారు ఆనందపారవశ్యంలో మునిగి తేలుతూ ఉంటారు. అంతేకాదు మనస్సు తదాకారం పొందుతుంది. ఉప్పబొమ్మని నీటిలో ముంచితే కరిగిపోయి తన రూపాన్ని కోల్పోతుంది. ఇంక రెండవ వర్గం సాధకులు కేవలం భక్తులు. వారు గుడ్డ బొమ్మలాంటివారు. సద్గురు మూర్తి బోధని చెప్పినది శ్రద్ధగా వింటారు. ఆనందిస్తారు. పరమాత్మ తత్త్వాన్ని గ్రహిస్తారు. కానీ తదాకారాన్ని పొందరు. గుడ్డబొమ్మని నీటిలో ముంచితే నీటిని పీల్చుకుంటుంది. కానీ తన ఆకారాన్ని కోల్పోదు. ఆ బొమ్మని గట్టిగా నొక్కితే పీల్చుకున్న నీరు కారిపోతుంది. అలాగే భక్తులు కూడా తాము శ్రవణం చేసిన గురుబోధని ఎవరికైనా చెప్పగల్గుతారు.

ఇంక మూడవరకం సాధకులు కపటభక్తులు లేక అవసరార్థ భక్తులు. వారికి ప్రాపంచిక దృష్టి ఎక్కువ. భగవంతుని దృష్టి చాలా తక్కువ. మహాత్ములు ఎంత బోధించినా ఏమి లాభం? ఒక చెవితో విని రెండవ చెవితో వదిలి పెడతారు. ఇటువంటి అవివేకులు రాతి బొమ్మలాంటివారు. రాతిబొమ్మని నీటిలో ఎంతసేపు నానబెట్టినా ఏమి లాభం? అది నీటిని పీల్చుకోదు. ఎక్కడ ఉన్నావే గొంగళీ అంటే వేసినచోటే ఉన్నానే కంబళీ అన్నట్లుగా ఉంటుంది. వారి ప్రవృత్తి. వారు ప్రకృతికి తలవంచుతారు. కానీ పరమాత్మకి తలవంచరు. వారు సద్గురుమూర్తి చెప్పిన బోధని మరచిపోవచ్చు. లేక చెప్పింది ఒకటైతే భావించేది వేరొకటి అవుతుంది." అన్నారు. కాబట్టి సాధకులు ఉప్పబొమ్మ లాగా వివేకవంతులై సుద్గరుమూర్తి చేసిన బోధని శ్రద్దగా శ్రవణం చేసి దానిని నిరంతర విచారణ ద్వారా మననం చేసుకుంటూ నిదిధ్యాస్యకు తెచ్చుకుంటేవారు 'గురోరన్యం న భావయేత్' అన్నదానిని అక్షరాలా ఆచరించినవారై సద్గురుమూర్తి అనుగ్రహానికి పాత్రులై మోక్షార్హతకి అనువైనవారు అని చెప్పటానికి సందేహమేముంది?" అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## కాలజ్ఞాన విదగ్రణి - శ్రీగురుదేవులు

"కాలానికి మార్పు ఉన్నది. కాని, కాలజ్ఞాన విదగ్రణి, కాల స్వరూపుడు అయిన పరమాత్మకు మార్పులేదు. సృష్టిలో అన్నిటికంటె విలువైనది కాలం. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనం నవరాత్రులు చేసుకుంటున్నాం; ఇంకా అనేక పండుగలు జరుపుకుంటున్నాం; పారాయణలు చేస్తున్నాం; భజన ధ్యానాదులు చేస్తున్నాం; అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నాం. ఈ పుణ్యకార్యాల ద్వారా మన కాలం 'సత్యకాలం'లో జమౌతుంది. ఈ విధంగా నిరంతరం మనస్సును భగవత్పరంగా మలచుకోవచ్చు. నిజమైన విచారణ చేయుటమే ధ్యానం. శ్రీగురుదేవులు అనేక మార్గాలు చెప్పారు - 'ఇవన్నీ మంచివే కానీ, అన్నిటికంటె అత్యుత్తమమైనది విచారణ' అని. భగవద్విచారణ. తత్త్వ విచారణ అవిచ్ఛిన్నంగా, తైలధారవలె జరిగితే ఇక అంతకంటె గొప్ప ధ్యానమేమిటి?



శాస్త్రాలు చదివినంత మాత్రాన జ్ఞానం రాదు. జ్ఞాన విజ్ఞాన యోగానుభవమును పొందిన వారికి శాస్త్రంతో పనిలేదు. అందుకనే ఆదిశంకర భగవత్పాదులవారు 'అవిజ్ఞాతే పరే తత్వే - శాస్త్రాధీధిస్తు నిష్ఫలాః విజ్ఞాతే పరే తత్వే - శాస్త్రాధీధిస్తు నిష్ఫలాః' అని శెలవిచ్చియున్నారు.

ఇంతకీ శాస్త్రం గొప్పదా? శక్తి గొప్పదా? శాస్త్రం పరిమితమైనది; శక్తి అపరిమితమైనది. అపరిమితమైన ఆ అనంతశక్తిని తెలపడం కోసం అనేక శాస్త్రాలు ఉద్భవించాయి. ఈ శాస్త్రాధ్యయనంలోనూ, శాస్త్రవాసనలలోనూ బంధింపబడిపోతే, దాని నుండి బయటపడటం చాలా కష్టం. అందుకనే ఉత్తరగీతలో శ్రీకృష్ణ భగవానుడిలా శెలవిచ్చారు -

'అనంత శాస్త్రం బహువేదితవ్యం ।అల్పశ్చకాలో బహువశ్చ విఘ్నాః ।
యత్సారభూతం తదుపాసితవ్యం । హంసో యథా క్షీర మివాంబు మిశ్రమ్ ॥

తెలుసుకోవలసిన శాస్త్రాలు అనేకానేకమున్నాయి. కానీ మన దగ్గర వున్న కాలం చాలా అల్పం; విఘ్నాలు చూడబోతే వాటికి అంతే లేదు.కనుక మానవుడు ఏం చేయాలి? హంస ఏ విధంగా నీటి నుండి పాలను వేరుచేసి, పాలనే గ్రోలుతుందో, అదే విధంగా మానవుడు ఈ

అనంత శాస్త్రాల నుండి, సారభూతమైన దానినే గ్రహించాలని తాత్పర్యం.

'శీర్యతే ఇతి శరీరః' అని గుర్తించాలి. నశ్వరమైన ఈ శరీరాన్ని ప్రకాశింపజేసే చైతన్యమే 'ఆత్మవస్తువు'.

వాసాంసి జీర్ణాని। యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి। తథా శరీరాణి విహాయ జీర్ణాన్ । అన్యాని సంయాతి నరోపరాణి।। (గీత2/22)

జీర్ణవస్త్రాన్ని వదిలేసి, క్రొత్తవస్త్రాన్ని ఎలా ధరిస్తామో, అదే విధంగా జీర్ణ శరీరాన్ని వదిలిపెట్టి మరొక క్రొత్త శరీరాన్ని పొందుతున్నాడు జీవుడు.

దేహినోస్మిన్ । యథాదేహే కౌమారం యౌవనం జరా తథా దేహాంతర ప్రాప్తిః ధీర స్తత్ర న ముహ్యతి గీత (2/13)

ఏ విధంగా అయితే ఈ శరీరంలో కౌమారం, యౌవనం, ముసలితనం అనే మార్పులు ఒకదాని వెనుక ఒకటి వస్తున్నాయో, యీ దేహం నశించిన పిమ్మట మరొక దేహం వస్తున్నది. కనుక ధీరుడు, జ్ఞాని అయిన వాడు దీని గురించిన భ్రమలో పడడు. - అని గీతాచార్యుడు శెలవిచ్చాడు.

ఈ సృష్టి అంతా మార్పుతో కూడుకున్నదే. క్రొత్తనీరు వచ్చి పాతనీరును వెనుకకు నెట్టివేసినట్లు, కాలంతోపాటు అనేక మార్పులు చూస్తున్నాం. ప్రపంచం, శరీరం అన్నీ మార్పులు చెందుతున్నాయి. కానీ ఈ మార్పులను గుర్తిస్తూ లోనఉన్న కాలస్వరూపుడికి మాత్రం మార్పు లేదు. అందుకేనేమో శ్రీసద్గురుదేవుల ప్రార్థనా శ్లోకాలు మూడింటిలోనూ కాలం గురించి వచ్చింది.

1. ఆనందైకరస ప్రసార విలసన్మందస్మితాస్యమ్। కృపాపారీణం నిజభక్త మానస నవాంభోజాత భానూదయం। కాలజ్ఞాన విదగ్రణిం, శివకరం కాళీసమం సద్గురుమ్ ॥

2. అనంతశక్తి సంపన్నమ్, అమలమ్, కాలవేదినం వందే కాళీప్రసాదమ్। మత్కామితార్థ ప్రదం గురుమ్ ॥

3. కాళికటాక్ష పరిలబ్ధ సుఖానుభోగ కేళీవిలాస విభవోదయ హేతుభూతం। కాలజ్ఞతాది మహితోజ్వల శక్తిమంతం। కాళీప్రసాద గురుపాద యుగం నమామి ॥

ఇక్కడ శ్రీగురుదేవులను 'కాలజ్ఞాన విదగ్రణి' అని, 'కాలవేదినం' అని, 'కాలజ్ఞ' అని వర్ణించారు. 'కాలోస్మి, 'కాలం కాలవతామహమ్' అని తానే కాలస్వరూపుడననీ గీతాచార్యుడు శెలవిచ్చివున్నాడు. కనుక కాలం యొక్క స్వరూపాన్ని తెలుసుకున్న మహితోజ్వల శక్తిమంతుడు, కేవలం కాలజ్ఞాన స్వరూపుడైన గురుదేవుడు మాత్రమే.

(తరువాయి భాగము 10వ పేజీలో చూడండి)

# భగవత్ప్రాప్తికి సాధనము

- పరాశర ప్రసాద్

భగవద్భక్తుడైన ఒక సాధకుడు రావిచెట్టు క్రింద ఒక కుటీరంలో ఆవాసం చేస్తూ గీతాపారాయణము, సాధువుల సేవ, భజన, ఉపాసనాది కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్న సమయంలో దేవర్షి నారదుడు ఆ భక్తుని సందర్శనార్థం వచ్చాడు. నారదునికి సేవాశుశ్రూషలు సమర్పించి, “స్వామీ! తమరు ఇప్పుడు ఎక్కడికి ప్రయాణమై వెడుతున్నారు?” అని ప్రశ్నించాడు. నారదుడు “వైకుంఠనాధుని దర్శనార్థం వెడుతున్నాను” అని సమాధానం చెప్పాడు. అది విన్న సాధకుడు, నారదునికి చేతులు జోడించి నమస్కరిస్తూ “ఆ స్వామి దర్శనం నాకెప్పుడు లభిస్తుందో తెలుసుకో గలరా?” అని అమాయకంగా ప్రశ్నించటం, “ఆ విషయం స్వామిని అడిగి తెలుసుకుని నీకు తప్పక తెలియజేస్తాను” అనటం జరిగిపోయింది.

నారదమహర్షి వైకుంఠం చేరగానే సర్వజ్ఞుడైన నారాయణుడు నారదుని యోగక్షేమాలు విచారించటమే కాక, “ఆ భక్తునికి నా దర్శనం దుర్లభమనీ; అతని సాధన ఫలించటానికి అతని కుటీరం వెలుపలున్న రావిచెట్టుకు ఎన్ని ఆకులున్నాయో అని సంవత్సరాల కాలం పట్టవచ్చుననీ తెలియజేయి” అని చెప్పాడు.

నారదుడు వెంటనే వచ్చి, ఆ విషయాన్ని ఆ భక్తునికి చెప్పాడు. కాని ఆ భక్తుడు మాత్రం నారదుడు ఊహించినట్లు ఏ మాత్రం నిరాశ చెందలేదు. తనకి ఎప్పటికైనా దైవదర్శనం కాబోతోందని సంతోషించాడు. ఆ భక్తుని ఆనందానికి అవధులు లేవు. అసలు భగవంతుడు తనకి దర్శనం ఇవ్వటానికి అంగీకరించాడా! ఈ దీనుని అనుగ్రహించాడా! అని సంతోషంతో దేహాన్ని మరచి సంకీర్తన చేస్తూ ఉన్మత్తుడై నృత్యం చేయటం ప్రారంభించాడు. అతని ఆనందపారవశ్యానికి నారదుడు ఆశ్చర్యపోయాడు! మరుక్షణమే శ్రీమన్నారాయణమూర్తి అక్కడ ప్రత్యక్షమయ్యాడు! మహూర్త కాలం గడవక మునుపే నారాయణమూర్తి అక్కడకు రావటం, ఆ భక్తునితో కలసి నృత్యం చేయటం నారదుడిని ఆశ్చర్యపరచింది. నారదుడు కూడా భావావేశంలో తన్నుతాను మరచి భగవంతుని కీర్తిస్తూ గానం చేస్తూ నృత్యం చేయటం ప్రారంభించాడు.

యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్ - అనే గీతా బోధ రహస్యం ఇదేనేమో! సాధువుల సేవ, శుశ్రూష, ఉపవాసము,

పారాయణ, భజన, ధ్యానాదులు అనబడే క్రియలు భక్తికి నిదర్శనమే సందేహం లేదు. కానీ క్రియా ప్రాధాన్యంతోపాటు భావప్రాధాన్యం కూడా అవశ్యమే. భక్తుడు అనన్య ప్రేమభావనతో తన్నుతాను మరచి, భగవంతుని సేవలో నిమగ్నమైనప్పుడు భగవానుడు నీకు భిన్నంగా ఉంటాడా! భగవంతుని దర్శనం పొందాలి అనే కోరికతో చేసే సేవ క్రియగా భావించ బడుతుంది గాని అక్కడ అనన్య ప్రేమ భావం లేదు. ఆ భావం కలిగిన మరుక్షణమే భక్తునికి ముక్తి! అటువంటి భక్తునికోసం భగవంతుడు అన్వేషిస్తూ ఉంటాడు.

---

( 8వ పేజీ తరువాయి భాగము)

కేవలం విచారణ ద్వారా మనం కాలాన్ని కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. 'ఇంత వయస్సు వచ్చింది. ఈ విషయం నాకు అవసరమా? కాదా' అనే విచారణ చేసుకోవాలి. నీకెంత వరకు కావాలో అంతవరకే అనుభవించు. ఉల్లిపాయ పొరలు, అరటి బోదెను ఒలిచినట్లుగా ఒకొక్కటీ తీసివేస్తూ వెళితే, అక్కడికి ఏమీ మిగలదు, కేవలం ఒలిచేవాడు మాత్రమే మిగులుతాడు. ఇదే 'నేతి -నేతి' (నా + ఇతి). అంటే 'ఇది కాదు - ఇది కాదు' అని విచారణ ద్వారా నిజతత్వాన్ని తెలుసుకోవచ్చు.

నీ సత్యవస్తు విచారణ సాధనలో అనేక ఇబ్బందులు ఎదురు అవుతాయి. వృద్ధాప్యంలో కూడా నీ మనస్సు ప్రక్కతోవలు పట్టి, నీకు చికాకు కలిగించవచ్చు. అనేక విధాలుగా నీ సాధనకి అవరోధాలు రావచ్చు. నీవు నిదురపోవాలనుకున్నప్పుడు ఎవరెన్ని ఫోనులు చేసినా, ఎన్ని బెల్లులు కొట్టినా ఎలా స్పందించవో, అదే విధంగా ఎవరైనా నిన్ను ఎన్ని విధాలుగా మభ్యపెట్టాలని చూసినా, నీ మనస్సు వాటిని అంగీకరించకపోతే వాళ్ళు వెనుతిరిగి వెళ్ళిపోతారు.

కనుక శ్రీగురుదేవుల యందు అకుంఠిత విశ్వాసం కలిగి వుండి, గురుదేవుల ఆజ్ఞమేరకు సాధన చేసిననాడు మనం సాధించలేనిది ఏదీ వుండదు. అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను, అఖండ సాధన సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు మనలను సర్వదా కాపాడుగాక! సుఖీభవ!!

# చిదగ్ని కుండ సంభూతా

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

చిత్ అంటే జ్ఞానం. జగన్మాత జ్ఞానాగ్ని కుండంలో నుండి ఆవిర్భవించింది - అని యీ నామం చెబుతోంది. అయితే ఈ అగ్ని కుండం/యజ్ఞకుండం ఎప్పుడో ఎక్కడో చరిత్రలో లేదు. మన మనస్సనే యజ్ఞకుండంలో ధ్యానాగ్నిని రగిల్చి, అందులో నిరంతర సాధన ద్వారా శబ్ద స్పర్శ రూప రస గంధాలనే పంచతన్మాత్రలను, పంచ వాయువులను, అంతఃకరణ చతుష్టయాన్ని, మూడు గుణాలను, మూడు అవస్థలను, మూడు మలాలను, మూడు వాసనలను, మూడు ఈషణాలను, మూడు తాపాలను, అహంకార మమకారాలను, సుఖదుఃఖాలను, రాగద్వేషాలను హవిస్సులుగా అర్పిస్తూ యజ్ఞం చేస్తూ ఉంటే, ఆ ధ్యానాగ్నియే జ్ఞానాగ్నిగా పరివర్తన చెందుతుంది.

అప్పుడు మనలోనే ఆ చిదగ్ని కుండం నుండి అష్టాదశ భుజాలతో, సర్వాభరణ భూషితయై, కోటి సూర్యుల కాంతిని కూడా తలదన్నే కాంతితో జగన్మాత ఆవిర్భావం జరుగుతుంది. ఇది సాధించిన మహాత్ములు నిరంతర ఆత్మజ్యోతితో ప్రకాశిస్తూ, నలుదిశల తమ ప్రసన్న రోచస్సులను వెదజల్లుతూ వుంటారు. అట్టి మహాత్ముల దర్శన మాత్రం చేతనే మన సకల తాపాలు నశించి అంతులేని ప్రశాంతతతో మన హృదయం నిండిపోతుంది.

ఇక అలా జగన్మాతను తమలోనే సాక్షాత్కరింప చేసుకున్న మహాత్ములు మనలో ఉన్న అజ్ఞానమనే మహిషాసురుని సమూలంగా నాశనం చేయగలరనటంలో సందేహమేముంది? అందుకే **గురుస్సాక్షాత్ పరబ్రహ్మ** అని మన ఆర్ష ధర్మం బోధిస్తుంది. సర్వదేవతా మూర్తుల శక్తులన్నీ కలిసి జగన్మాతగా ఎలా అయితే రూపు దాల్చాయో అలాగే గురువు కూడా సర్వదేవతా స్వరూపుడు. గురువుకి జగన్మాతకి భేదం లేదు.

# సంక్రాంతి

- రమణ ప్రసాద్

సృష్టిలోని చైతన్యాన్ని , ప్రకృతిలోని సోయగాలను సంతరించుకుని వచ్చే పండుగే సంక్రాంతి. కాల చక్రాన్ని తిప్పే సూర్యుడు అతీతుడు. ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క రాశిలో సూర్యుడు ప్రవేశిస్తాడు. దానినే సంక్రమణం అంటారు.



సంక్రాంతికి ఒక నెల ముందు సూర్యుడు ధనురాశిలో ప్రవేశిస్తాడు. అదే ధనుర్మాసం. ఈ ధనుర్మాసం ప్రారంభం నుండి మకర సంక్రాంతి వరకు శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో చూత వృక్ష ఛాయలో, శ్రీ సద్గురు దేవుల సన్నిధిలో, ప్రతిరోజు సంకీర్తన, తిరుప్పావై, ఋషుల చరిత్రల ప్రవచనాలు జరుగుతాయి. తదనంతరం శ్రీమదాంధ్రమహా భాగవత ప్రవచనం జరుగుతుంది. ఈ మాసంలో , క్రిస్‌మస్, ఆంగ్ల సంవత్సరాది, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు వస్తాయి. ఈ పండుగలలో శ్రీ సద్గురు పాద పూజ,సత్సంగ కార్యక్రమాలు జరుగుతాయి.

సూర్యారాధనలో జ్ఞాన యోగ భావం పొందిన రైతు, కర్మయోగ యోగాచరణ ద్వారా సాధించిన ధాన్యాన్ని ఇంటికి తెచ్చి, సిరి సంపదలను అనుభవిస్తాడు.

శ్రీగోదాదేవి గోపికలతో శ్రీకృష్ణుణ్ణి అతి భక్తితో సేవించింది. దానికి ప్రతీకగా వీధి ముంగిట ముగ్గులు వేసి, గోపికలను గొబ్బెమ్మలుగా. వాటి మధ్యలో గోదాదేవిని పెద్ద గోబ్బెమ్మగా పెట్టి బాలికలు నాట్యం చేస్తారు. సూర్యభగవానుని ఆశీస్సులు కోరుతూ, భోగిపళ్ళు చిన్న పిల్లల తలలమీద

పోస్తారు. తమ సంతానాన్ని ఆశీర్వదించి , వారు ఆరోగ్యవంతులుగా, బుద్ధిమంతులుగాకావాలని చేసేదే భోగి పండుగ.

శ్రీకాళీగార్డెన్స్‌లో భోగి పండుగ రోజు రాత్రి 8 గంటలకు ప్రత్యక్ష భగవానుడైన శ్రీ గురుదేవులకు హారతులిచ్చి, రేగు పళ్ళు, నాణాలు, పుష్పములు కలిపిన భోగిపళ్ళు శ్రీగురుదేవులకు పోస్తారు. అనంతరం శ్రీ మాతాజీవారు ఆ భోగి పళ్ళను భక్తులందరికీ తమ స్వహస్తాలతో ఇస్తారు. ఈ భోగిపళ్ళకోసం గ్రామ గ్రామాంతరాలనుండి భక్తులు తండోప తండాలుగా వచ్చి, భోగి పళ్ళను ప్రసాదంగా స్వీకరించి , వాటిలోని నాణాలను పూజా గృహంలో పెట్టుకొని, పుష్పాలను పొలాలలో జల్లి అధిక ఫలసాయాన్ని పొందుతారు.

శ్రీ గురుదేవుల అనుగ్రహం చేత వారికి సకల శుభాలు చేకూరుతాయని భక్తులకు గాఢ విశ్వాసం. శ్రీ గురుదేవులు వారి విశ్వాసాన్ని వమ్ము చేస్తారా? వారు తమ అనుగ్రహాన్ని వారిపై వర్షింపజేసి, ఇహ పరాలలో వారికి ఏ కొరత రాకుండా, వారి యోగ క్షేమాల భారాన్ని తాము స్వయంగా వహిస్తారు.

నూతన సంక్రాంతి సందర్భంగా శ్రీసద్గురుదేవుల శుభాశీస్సులు మన అందరిపై సంతత ధారగా వర్షించుగాక!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి గరికపాటి కమలమ్మ (అస్సాం కమలమ్మ)గారు 21-11-2016 సోమవారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 82 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# కార్తీక దామోదరా! కాశీప్రసాదా!

- రమణ ప్రసాద్

దామోదరమ్ ప్రపద్యేహ౨ ఉమ్ శ్రీ రాధారమణమ్ ప్రభుమ్ ।
ప్రభవద్యశ్య తత్-ప్రేష్ఠ కార్తీకః సవితో భావేత్ ॥
"శ్రీరాధా ప్రియుడైన దామోదరునికి ప్రియమైన కార్తీక మాసంలో ఆయనకు ప్రీతికరమైన సేవలు చేసే భాగ్యాన్ని ప్రసాదించమని వేడుతున్నాను."

ఈ నెలలో వైష్ణవులు శ్రీ దామోదరుని పూజలు చేస్తారు. ఆయనకు ప్రీతికరమైన సేవలు చేస్తారు. ఆయన శరణాగతి పొందుతారు. ఆయనకు దామోదరుడనే పేరు ఎందుకు వచ్చిందో చూద్దాం.

ఒకసారి యశోదాదేవి పెరుగు చిలుకుతుంటే నల్లనయ్య అమితంగా ఆకలిగొన్నవాడి లాగా వచ్చి పాలు కావాలని మారాం చేశాడు. అప్పుడు తన చేతిలో పని మాని పాలివ్వబోతే కడుపు నిండిన వాడిలాగా ఆమె ఒళ్ళో కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నాడు. ఇంతలో పాలు పొంగుతుంటే దింపటానికి ఆమె అటు వెళ్ళగానే, ఒక గుండ్రాయితో అక్కడ ఉన్న పెరుగు కుండను పగులగొట్టి అందులో ఉన్న వెన్నను గబ గబా తిన సాగాడు. యశోద తిరిగి వచ్చేటప్పటికి పగిలి ఉన్న కుండ పెంకులను చూసి,'ఇది కన్నయ్య పనే' అని అతడిని వెదక సాగింది. పాల చారికలు గుర్తు పట్టి ఆ ప్రక్క ఇంటికి వెళ్తే, ఒక రోటిమీద నుంచుని ఉట్టి పైన ఉన్న వెన్న కుండనుంచి వెన్న తీసుకు తింటున్నాడు. అంతేకాదు అక్కడ ఉన్న ఒక కోతికి కూడా వెన్న పెడుతున్నాడు.

యశోద అక్కడ ఉన్న కర్ర తీసుకుని అతడిని సమీపించగా, భయ పడినవాడిలా ముఖం పెట్టి పారిపోసాగాడు. ముందు కన్నయ్య, వెనుక యశోదా మాత - స్థంభాల మధ్యనుంచి తల్లికి చిక్కకుండా పరిగెడుతూ, తల్లితో, " ఇంకెన్నడూ వెన్న దొంగిలించను. నా తప్పును మన్నించు" అని కాటుక కళ్ళను నులుముకుంటూ ఏకధారగా ఏడుస్తున్నాడు. కాటుకను ముఖం అంతా పులుముకుంటున్నాడు. ఇలా చాలా సేపు జరిగింది. యశోద బాగా అలిసిపోవటం చూసి కన్నయ్య తనకు తానుగా పట్టుబడ్డాడు. అలా చిక్కిన వాడిని కొట్టటానికి చేతులు రాక ఒక త్రాడుతో కడదామని చూసింది. కాని ఆ త్రాడు చిన్నదవటంతో

ఇంకొక పెద్దత్రాటితో కట్టబోయింది. ఎన్ని త్రాళ్ళు తెచ్చి కట్టి నా ఆ బాలుని చిన్న నడుమును కట్టలేకపోయాయి. తనను బంధించటానికి తల్లి పడుతున్న పాట్లను చూసి జాలిపడి, బంధ విమోచనుడైన ఆ పరమేశ్వరుడు తనకు తానై బంధింపబడ్డాడు.

చిక్కడు సిరి కౌగిలిలో
జిక్కడు సనకాది యోగి చిత్తాబ్జములం
జిక్కడు శ్రుతిలతి కావలి
జిక్కెనతడు లీల దల్లి చేతన్ రోలన్ ॥

కన్నయ్యను రోటికి కట్టి యశోద లోపలికి వెళ్ళగా,కృష్ణుడు ఆ రోటిని ఈడ్చుకుని వెళ్ళి అక్కడ ఉన్న రెండు మద్ది చెట్ల మధ్యనుంచి రోటిని లాగగా ఆ చెట్లు కూలి అందులోనుంచి హయగ్రీవ నలకూబరులు శాప ముక్తులై వచ్చి శ్రీ కృష్ణునికి సాష్టాంగ ప్రణామాలు చేసి,ఆయనను అనేక విధాల స్తుతించి వెళ్ళిపోయారు. నందుడు వచ్చి శ్రీ కృష్ణుడి కట్లు విప్పాడు. అక్కడ జరిగనదేమీ తెలియని వాడిలా ఆడుతూ పాడుతూ తోటి బాలురతో కలిసిపోయాడు.

భక్తులెందరికో మన బాబూజీ మహరాజ్ ఇలా చేసిన లీలలు జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా -'కార్తీక దామోదరా! కాళీ ప్రసాదా!' అని ఆనందాతిరేకంతో కీర్తిస్తుంటారు.



# సత్య గురుదేవులు-నకిలీ గురువులు

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

ఈనాటి సమాజంలో సహజంగా చాలామందికి కలిగే సందేహం ఇది. 'ఇంతమంది నకిలీ గురువులను చూస్తున్నాం కదా, ఇందులో సత్య గురువును గుర్తించటం ఎలా?' అని. కొంతమంది అయితే ఇంకో అడుగు ముందుకు వేసి, 'అసలు మాకు గురువుల వ్యవస్థ మీదే నమ్మకం పోయింది. మేము సత్యగురుదేవులను వెదకి ఆశ్రయించవలసిన పని ఏమున్నది?' అంటారు.

ఇప్పుడే కాదు. ఎన్నో దశాబ్దాల పూర్వమే శ్రీబాబూజీ మహరాజ్ వారిని ఎంతోమంది ఇలా ప్రశ్నించి సందేహ నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి ప్రశ్న వేసినవారిని శ్రీగురుదేవులు తిరిగి ప్రశ్నిస్తూ "నీకు ఒక రోగం వచ్చిందనుకో, బజారులో నకిలీ మందులు ఎక్కువయి పోయాయి అనిచెప్పి మందు తీసుకోవటం మానివేస్తావా? అలాగే నకిలీ డాక్టర్లు ఎక్కువయ్యారని వైద్యం చేయించుకోవటం మానివేస్తావా? నీకు రోగం తగ్గటం ముఖ్యం. అందుకని కష్టపడి వెదికి, మంచి వైద్యుని సంప్రదించి అతను వ్రాసిన మందులను కూడా మంచివి వెదికి వేసుకుంటావు కదా. అలాగే భవరోగంతో బాధపడే ప్రతి ఒక్కరూ సత్యగురుదేవులను వెదికి ఆశ్రయించి తరించటానికి ప్రయత్నించవలసినదే" అని చెప్పేవారు.

సత్య గురుదేవులు ఎప్పుడూ నీ దగ్గర నుండి ఏమీ ఆశించరు. ఎందుకంటే వారు మన నుండి ఆశించేది మన భక్తిని, పరిపూర్ణ విశ్వాసాన్ని మాత్రమే. అది కూడా మనం తరించడానికే కానీ, అలా కాక కొందరు గురువులు నమస్కారానికి, పూజకి, సంభాషణకి ఇలా ప్రతిదానికి ఒక వెల నిర్ణయించి, వసూలు చేస్తూ ఉంటారు. ఇలాంటి వారిని 'చేతిలో రూపాయి - చెవిలో మంత్రం చెప్పే గురువులు' అనేవారు.

ఇక అసలు గురువులతో పని ఏముంది? మనమే నేరుగా భగవంతుని చేరలేమా? అనే ప్రశ్నకు వస్తే, మనకు శ్రీనామదేవుల చరిత్ర యిందుకు చక్కని సమాధానం చూపిస్తుంది. శ్రీనామదేవులు స్వయంగా పాండురంగని దర్శించి, సంభాషించి, నివేదన తినిపించిన

పరమ భక్తుడు. కానీ శ్రీ జ్ఞానదేవుల వారి ఆదేశంతో గోరాకుంభార్ అనే భక్తుడు నామదేవుని పరీక్షించి 'ఇది పచ్చికుండ' అని నిర్ధారిస్తాడు. అది విని, నామదేవుడు పాండురంగని ఆలయంలో ప్రవేశించి, స్వామి వద్ద తన ఆవేదన వెలిబుచ్చుతాడు. అప్పుడు స్వామి స్వయంగా తెలియజేస్తారు 'నువ్వు ఎంతటి పరమ భక్తుడవైనా ఒక గురువుని ఆశ్రయించి, జ్ఞానాన్ని పొందనిదే పరిపూర్ణుడవు కాలేవు; ముక్తిని పొందలేవు' అని. ఆ తరువాత ఆయన విశోబాకేశు అనే గురువును ఆశ్రయించి, భగవంతుడు ఒక్క గుడిలోనే కాదు అంతటా ప్రకాశించేసర్వవ్యాపకుడు అని తెలుసుకుంటాడు.

మరి సత్యగురుదేవులను తెలుసుకోవటం, వారిని ఆశ్రయించటం ఎలా? నీ భక్తి, ఆవేదన గాఢమైనప్పుడు భగవంతుడే సత్యగురుదేవుల రూపంలో నీ వద్దకు నడిచి వస్తాడు. 'అప్రత్యక్షో మహాదేవః సర్వేషాం ఆత్మ మాయయా। ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి సిద్ధయే॥' - అయితే అట్టి గురుదేవుడు లభించినప్పుడు కూడా ఇంకా మూర్ఖంగా ప్రవర్తించి, వారిని కోల్పోకుండా సరియైన సమయంలో వారిని గుర్తించి, ఆశ్రయించినప్పుడే మనం ప్రయోజనాన్ని పొందగలుగుతాము.

అలా కాకుండా, నేను భగవంతుని నేరుగా చేరుకుంటాను, ఈ గురువుల అవసరం ఎమున్నది? అని వాదించేవాళ్ళు -

నాకు చదువు వచ్చు, లేదా నా యింట్లో ఎన్నో పుస్తాకాలు వున్నాయి, ఇక మా పిల్లలను బడి ఎందుకు, అని మాన్పిస్తున్నారా? తమకు రోగం వస్తే వైద్యుడు ఎందుకు? అని తమ వైద్యం తామే చేసుకుంటున్నారా? తమ ఇల్లు తామే స్వయంగా కట్టుకుంటున్నారా? తమ భోజనం తామే పండించు కుంటున్నారా? తమ బట్టలు తామే నేసుకుంటున్నారా?

ఇలా జీవితంలో ప్రతిదానికీ ఇతరుల మీద ఆధారపడి, వారి సహాయాన్ని తీసుకునే మానవులు భగవంతుని విషయం వచ్చేసరికి మాత్రం అంతా తమకే తెలుసునని, ఇక గురువుల అవసరం ఏమున్నదని అజ్ఞానంతో, ప్రశ్నిస్తారు! ఎంత మూర్ఖత్వం?

# అవతార్ శ్రీ మెహర్‌బాబా ఆధ్యాత్మిక సందేశము

సేకరణ - మురళీ

ఎదుటివాడు నీ పట్ల ఎంత కఠినంగా ప్రవర్తించినా నీవు ఎల్లప్పుడూ శాంతంగా వుండాలి. నీవు అడిగింది కాదన్నా, లేక నీ మీద తప్పు పట్టినా, నిన్ను నిందించినా లేక పొగిడినా, నీవు అన్నీ విని సహించి ఊరుకోవాలి. ఇదే నిజమైన ధైర్యము, స్థైర్యము. ఒకడు సైన్యాన్ని లొంగ దీయగలడు. కానీ, తన కోపాన్ని జయించలేడు. కామము, క్రోధము, కాంచనము ఈ మూడు భగవంతుని దూరం చేసేవి. కామినీ కాంచనాలను జయించగలిగినా, క్రోధమును జయించటం చాలా కష్టం. అవి మూడూ జయించ గలిగితే నీవు మహాత్ముడువన్నమాటే!

ఒకడు ఎడారిలో వెళ్తుండగా వానికి దాహం వేస్తుంది. అప్పుడు అతనికి కావలసినది దోసెడు మంచినీళ్ళు. నీళ్లకు బదులు రత్నాలు, ముత్యాలు కనిపించాయి అనుకోండి. అవి వానికెందుకు? ముందు వాని దప్పిక తీరాలి, వాడి ప్రాణం నిలపాలి. అలాగే నిజమైన భక్తుడు భగవంతునికోసమే ప్రయత్నిస్తాడు. తక్కిన విషయాలన్నీ అల్పంగా చూస్తాడు. నిజమైన భక్తుడు పేరు, కీర్తి, ధనాల కోసం ప్రాకులాడడు. అతడు భగవంతుడొక్కడే కావాలని కోరుకుంటాడు. భగవద్భక్తుడు కానివాడు కేవలం స్వార్థపరుడుగా పరిగణింపబడతాడు.

జ్ఞానసంపదను లేశమాత్రమైన పొందగలిగితే అనిర్వచనీయ ఆనందమును చవిచూడగలుగుతావు. బాహ్యంగా కనబడే ప్రతి వస్తువూ దాని కథ మీకు చెబుతుంది. దుఃఖభూయిష్ఠంగా గోచరించే ఈ ప్రపంచమంతా ఆనందనిలయంగా, స్వర్గంగా భాసిస్తుంది. సద్గురు తన ఉత్తరాధికారిగా తనవలె ఒక్కని తయారుచేసి, అతనిని తన ఏకైక వారసునిగా చేసుకుని తస సర్వస్వము అతనికి అప్పగిస్తాడు. ఆ వారసుడు తనకు సంక్రమించిన పెన్నిధిని తన శిష్యబృందమునకు పంచి

పెడతాడు. వారి వారి శక్తి సామర్థ్యాలను, యోగ్యతలను బట్టి ఆత్మ జ్ఞానము, శక్తి నిర్ణీత సయమంలో శిష్యులకు లభిస్తాయి.

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

జనవరి 2017

01 ఆది : ఆంగ్ల సంవత్సరాది, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

08 ఆది : ముక్కోటి ఏకాదశి. ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

12 గురు : పౌర్ణిమ, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

13 శుక్ర: భోగి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, శ్రీబాబుకు భోగిపళ్ళుపోయుటం, భక్తసమారాధన.

14 శని : మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

22 ఆది : శ్రీ గురు దశమి, ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

25 బుధ నుండి 29 ఆది వరకు శ్రీమాతాజీవారి సత్సంగసమావేశములు.

ఫిబ్రవరి 2017

03 శుక్ర - రథసప్తమి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

07 మంగ : భీష్మ ఏకాదశి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

10 శుక్ర మాఘ పౌర్ణమి- సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

21 మంగ : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

25 శని : మహాశివరాత్రి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# నగురోరధికం-శివశాసనతః

- రమణ ప్రసాద్

ది. నవంబరు 17 నుండి 24 వరకు శ్రీ సద్గురు దేవుల 28వ పుణ్యారాధనలు ఎంతో వైభవంగా జరిగాయి. శ్రీ గురు చరిత్ర ప్రవచనంతో, పంచయజ్ఞ విధులతో ( 1. శ్రీ గురు శత సహస్ర నామార్చన;2.అఖండ భగవన్నామ సంకీర్తన;3. అఖండ పారాయణ;4. అఖండధ్యానము; 5.శ్రీగురుకోటి నామ జపము) ప్రారంభ మయ్యాయి. ది. 21న ఊంజల సేవ; ది.22న రథోత్సవము; ది.23నశ్రీ సద్గురు పాద పూజ దీపోత్సవము మొదలైన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దేశ విదేశాలనుండి భక్తులు అసంఖ్యాకంగా వచ్చి ఈ కార్యక్రమాలలో పాల్గొని, తమ అమూల్యమైన సేవలను అందించారు. ది.18 నుండి ది.22 వరకు జరిగిన సత్సంగ సమావేశాలలో పూజ్య శ్రీ దండి నిర్మలానంద గిరి స్వామివారు, పూజ్య శ్రీ మాతాజీవారు, గురుసోదర సోదరీమణులు తమ దివ్య సందేశాలను అందించారు.



పూజ్య శ్రీ దండి నిర్మలానంద గిరి స్వామి వారు ప్రసంగిస్తూ :- “శ్రీ సద్గురు దేవులు ఎవరు? శ్రీ సద్గురుదేవులు మనకు ఇహాన్ని పరాన్ని బోధించే వారు. సచ్ఛిష్యులైనవారు వారి బోధలను శ్రద్ధగా శ్రవణం చేసి, తర్వాత మనన, నిదిధ్యాసలలోకి తెచ్చుకోవాలి.

**అవిచారేణ కుతో బంధః విచారేణ విముచ్యతే** । కాబట్టి విచారణ చేయాలి. ఈ జగత్తు ఎలా వచ్చింది? దీనిని నడిపే నియంత ఎవరు? అని.



భగవంతుని సంకల్పం చేత ఈ జగత్తు వచ్చింది. మనకు కూడా సంకల్పాలు వస్తాయి. అవి రెండు రకాలు- శుభ సంకల్పాలు, అశుభ సంకల్పాలు.ఈ సంకల్పాలను వాయువు వాసనలను తనతో తీసికొని పోయినట్లుగా , తన గత జన్మ వాసనలను సూక్ష్మ రూపంలో తెచ్చుకుంటాడు. అజ్ఞానం (మాయ)చేత ఈ ప్రపంచం సత్యమని, నిత్యమని భ్రమిస్తాడు. తత్ఫలితంగా దుఃఖాల పాలవుతాడు. ఈ మాయ ఉన్నదానిని లేనిదానిగా లేనిది

వున్నదానిగా చూపిస్తుంది. విచారణ చేస్తే జగత్తు లేదని తెలుస్తుంది.

సాధకుడైనవాడు వివేకంతో తన మనస్సులో వచ్చే సంకల్పాలని ఏరి పారెయ్యాలి. ఈ సంకల్ప వికల్పాలకు అధిష్ఠానం నువ్వే. నువ్వు చూచేవాడివిగా ఉండు. ప్రపంచాన్ని సాక్షిగా చూస్తూ ఉండు. లేని సంసారాన్ని నువ్వు ఉన్నదని భ్రమిస్తున్నావు. మనస్సు ఎక్కడ పుడుతున్నదో, ఎక్కడ స్థితిలో ఉన్నదో, ఎక్కడ లయమవుతున్నదో గమనించు. ఈ విధంగా విచారణ చెస్తే జగత్తు లేదని తెలుసుకొంటావు. నామ రూప గుణ వికారాలు జగత్తు లక్షణం. అస్థి, భాతి, ,ప్రియం ఆత్మ లక్షణం. అందుకే విచారణ ముఖ్యం. విచారణ వలన దేహ వాసన తొలగి పోతుంది. మనస్సే తాదాత్మ్యం చెందుతుంది. 'విచేరేణ విముచ్యతే"- అని బోధించారు.

తరువాత శ్రీ మాతాజీ వారు  అనుగ్రహ భాషణం చేస్తూ ..........

"నిజమైన శాంతి భోగ భాగ్యాలవల్ల రాదు. లక్ష్యార్థ సాధన చేస్తే వస్తుంది.  శ్వాసతో పాటు లక్ష్యార్థ సాధన చేయండి. పోయిన క్షణం తిరిగి రాదు. ధ్యానంతో పాటు విచారణ చేయండి.  ఎవరి అనుగ్రహంతో ఈ సృష్టి నడుస్తోందో, ఎవరి అనుగ్రహంతో ఈ జీవితం ప్రకాశిస్తోందో గుర్తించండి.'పుట్టుటయు నిజము, గిట్టుటయు నిజము, నట్టనడుమది నాటకము, కట్టకడపటిది కైవల్యము' - అని గానం  చేశారు శ్రీ అన్నమాచార్యులవారు. మరి ఆ కైవల్యం అందించేది ఎవరు? శ్రీ గురుదేవులు.



బ్రహ్మ సత్యం జగన్మిథ్య అన్నారు శ్రీ శంకరాచార్యులవారు. సద్గురు సమాశ్రయం చేత, బ్రహ్మ సత్యం అని ,జగత్తుకు కూడా బ్రహ్మ ఆధారమని గుర్తించ గలుగుతావు. గురు భగవానుడు ఆదేశించినది తు.చ తప్పకుండా చేస్తే, దేహ వాసన తొలగి, శాశ్వతమైన శాంతి లభిస్తుంది. మనం శ్రీగురుదేవుల ఒడిలోనే ఉన్నాము. వారు మన చేయి పట్టుకొని నడిపిస్తున్నారు.

సత్య వస్తువు ఎంత సూక్ష్మమో అంత అనంతమయి ఉన్నది అనే విషయాన్ని గుర్తిస్తూ గురు కరుణలో తేలియాడుతూ మన జీవితాలను ధన్యం చేసికొందము గాక! అట్టి భక్తిని ,శక్తిని, అఖండ జ్ఞాన వైరాగ్యములను, సాధనా సంపత్తిని శ్రీ గురుదేవులు ప్రసాదించెదరు గాక! సుఖీభవ!"

# రాగద్వేషాలు

- పరాశర ప్రసాద్

లౌకిక సంసారంలో రాగద్వేషాలు అతి సామాన్యమనే విషయం అందరికీ తెలుసు. ఇవి వాసన ద్వారా సంక్రమిస్తాయి. రాగద్వేషాలు జీవుని సంస్కారంపైన ఆధారపడి ఉంటాయి. గుణాల ప్రమేయం కూడా ఉండ వచ్చు. వాసన, సంస్కారం, గుణాలు అనేవి అన్ని ఒకదానితో ఒకటి అల్లుకుని ఉంటాయి. వాటిని విడదీయటం కష్టం.

రాగద్వేషాలకు మూలం మనస్సు, ఇంద్రియాలు. అయితే అన్నింటికి మూలాధారం అవిద్య లేక అజ్ఞానము. వెలుగు లోపించటమే చీకటికి ఆధారమైనట్లు, జ్ఞానం మరుగుపడటమే అవిద్యకి కారణము అని భావించాలి.

మైత్రి, కరుణ, ముదితం, ఉపేక్ష అనేవి రాగద్వేషాలను దూరం చేస్తాయి. నిష్కామ కర్మ యోగాభ్యాసం ద్వారా రాగద్వేషాలు సన్నపడి పోతాయి. వైరాగ్యంతో రాగాన్ని, విశ్వప్రేమతో ద్వేషాన్ని జయించటం సాధ్యమే.

రాగద్వేషాలు అనేకరకాలు. కొన్ని రకాల ఆహార పదార్థాలు రుచికరిస్తాయి, కొన్ని రుచికరించవు. వస్త్రాలలో కొన్నింటినే ఇష్టపడతావు. కొందరు వ్యక్తులతోనే సంభాషణ చేస్తావు. కొన్ని శబ్దాలు ప్రియం, కొన్ని అప్రియం. స్తుతి అంటే ఇష్టం, నింద అంటే అయిష్టం. నీ అభిప్రాయమే అందరూ ఆమోదించాలి, నీ దృక్పథమే సరియైనది అనే భావనే రాగ ద్వేషాలకు నిదర్శనం. మానసిక సమతుల్యత, ప్రశాంతత లోపించటానికి కారణం రాగద్వేషాలే సుమా.

రాగద్వేషాలను నిర్మూలించిన వాడే సంతోషంగా, శాంతంగా, ఆనందంగా ఉంటాడు. సంతోషం ఉన్నప్పుడు రాగం తప్పదు. అలాగే బాధ ఉన్నప్పుడు ద్వేషం అనివార్యం. బాధని కలిగించేది వస్తువు ఎన్నడూ కాదు. అది వృత్తి ద్వారా, భావనా తరంగం ద్వారా కలుగుతుంది. అన్నింటి యందు విశ్వప్రేమ, ఈశ్వర భావన పెంచుకుంటే ద్వేషం నశిస్తుంది. ఈశావాస్యమిదగ్ం సర్వం - అనే భావన ఎప్పుడు ఆరూఢమవుతుందో ఆ క్షణమే రాగద్వేషాలు అంతమవుతాయి. వాటిని జయించలేని సాధకుడు ధ్యానంలో ప్రశాంతతని, సమాధి స్థితిని ఎన్నడూ సాధించ

లేడు. ఆత్మజ్ఞానాన్ని పొందటం అసాధ్యం.

రాగద్వేషాలు బలంగా ఉన్నట్లు సంకేతమేమంటే ఆ సాధకునిలో ఆత్మస్తుతి అధికంగా ఉంటుంది. నేను ధ్యానం బాగా చేస్తున్నాను, సమాధి స్థితిని పొందాను. ఆత్మసాక్షాత్కారం పొందానని ఎన్నో ప్రగల్భాలు పలుకుతాడు. అటువంటి వ్యక్తి సాధించినది శూన్యమని గ్రహించాలి. క్రోధం, పక్షపాతం, ఈర్ష్య, అసూయత అనేవి రాగద్వేషాలకు సంకేతాలు.

రాగద్వేషాలను అధిగమించటానికి సద్గురుసమాశ్రయమే శరణ్యము. సద్గురు బోధాశ్రవణం, మననము, రాగద్వేషాలను అధిగమించటానికి దోహదం చేస్తాయి. రాగద్వేషాలు వాసనా రూపాంతరం కాబట్టి అవి కర్మఫలము కాదు. దుష్కృత కర్మ ఆచరణ ఫలితంగా సంక్రమించినది కాదు. కాబట్టి ఏదైనా సుకృత కర్మ ఆచరించి దానివలన దానిని అధిగమించటం అసంభవం.

కేవలం సద్గురుమూర్తి పరమానుగ్రహం ద్వారా రహితం చేసుకోవాలి. వాసనారహితం కానిదే జన్మరాహిత్యం సాధ్యం కాదనే విషయాన్ని గ్రహించిన సాధకుడు సద్గురుమూర్తి సమాశ్రయంతో ఆయన అనుగ్రహానికి పాత్రుడై రాగద్వేషాలకు మూలమైన అవిద్యను అధిగమించ గలుగుతాడు.

## పూజ్యశ్రీ మాతాజీ సత్సంగములు

**హైదరాబాదు శాఖ** - 25-1-2017 నుండి 29-1-2017 వరకు ఆశ్రమ శాఖలో పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశాములు.
వివరములకు - 040-23329062; సెల్ - 99856 66797

**పెదనిండ్రకొలను శాఖ** - 03-02-2017 నుండి 07-02-2017 వరకు. వివరములకు - సెల్ నం. 9491222652

**గుండుగొలను శాఖ** - 19-2-2017 నుండి 21-2-2017 వరకు ప్రథమ వార్షికోత్సవ మహోత్సవముల సందర్భముగా పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశాములు.
వివరములకు - సెల్ - 98491 34442 ; 93465 35357

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

- సుషుమ్నా ప్రసాద

## వీతహవ్యుని కథ

"వరదల వల్ల పేరుకుపోయిన యిసుక మేటలో, అతని శరీరము భుజాల వరకు, కూరుకుపోయింది. ప్రాణమునకు స్వేచ్ఛతో కూడిన కదలిక లేదు, అందువల్ల శరీరానికి కూడ కదలిక లేదు, తపస్విగా వంద సంవత్సరాలు కైలాస పర్వత శ్రేణిపై గడిపాడు. తరువాత మరొక వంద సంవత్సరాలు విద్యాధరునిగ, తరువాత దేవలోకంలో దేవేంద్రునిగ ఐదు యుగాలు, ఆ తరువాత శివపుత్రుడైన గణేశునిగా కాలం గడిపాడు. వీతహవ్యుడు తన దృష్టి వలన, తన పూర్వజన్మలలోని సంఘటలను చూడగలిగాడు, అతనికి త్రికాల జ్ఞానమున్నది."



"వీతహవ్యుడు యిసుక మేటలో భూస్థాపితమైన తన శరీరమును బయటకు లేవ దీయాలనుకొన్నాడు. అతను తన సూక్ష్మ శరీరంతో, తన భౌతిక శరీరం చుట్టూ పేరుకు పోయిన యిసుకను తొలగించటానికి పింగళను పిలవటానికి, సూర్యుని వద్దకు వెళ్లాడు అప్పుడు పింగళ మేఘం రూపంలో వింధ్య పర్వత శ్రేణిలో ప్రవేశించాడు."

"ఆ మేఘమొక పెద్ద ఏనుగు రూపందాల్చి, భూమిని, యిసుకను తొలగించింది. తొలగించిన తర్వాత, పింగళ తన స్వస్థలమునకు వెళ్లిపోయాడు. ముని యొక్క సూక్ష్మ దేహము స్థూల దేహములో ప్రవేశించి, దానికి చైతన్యమును కలిగించింది. వెంటనే, ముని స్నానము చేసి, సూర్యదేవుని ఆరాధించాడు, తరువాత కొంత కాలము నదీ తీరమున గడిపాడు. అతనికి ప్రాపంచిక వస్తువులపై యెట్టి ఆకర్షణలేదు, అతనికి ఆత్మ నిగ్రహము, ఉదారత, ప్రేమ, సానుభూతి, గాంభీర్యము, కరుణ, సంతృప్తి, దయ, జ్ఞానము, ఆంతరంగిక ఆనందము పుష్కలముగ వున్నవి."

"వీతహవ్యుడు తనలో తను యిలా అనుకొన్నాడు "ఇంత వరకు నేను నా జ్ఞానేంద్రియములను నిగ్రహించుకొన్నాను. నేనిప్పడు నిర్వికల్ప సమాధిలో ప్రవేశించి, శిలలా స్థిరంగా వుంటాను. నేను శాశ్వతమైన, నిత్యానంద సాగరములో వోలలాడుతాను నేను ఆత్మలోనే వుంటాను, నేను గాఢ నిద్రలో వున్నవానిగా వుంటాను, ప్రపంచమునకు సంబంధించి, నేను నిర్జీవుడను, నాకు ప్రపంచాన్ని గురించిన స్మృతే లేదు. గాఢనిద్రలో వున్నప్పటికీ, నేనీ జగత్తులో జాగరూకుడనయే వుంటాను, నా స్వరూపాన్ని గురించి, నేను పూర్తిగా తెలివిలోనే వుంటాను. నాకు సంపూర్ణమైన అవగాహన, ఎరుకవున్నది, ఎలాంటి వైవిధ్యము లేని తురియావస్థలోని పరమానందమునుభవిస్తాను. నేను బ్రహ్మము యొక్క అద్వైత సారాన్ని పానము చేస్తాను."

ఆ విధంగా ఆలోచించి, అతను ధ్యానముద్రలో నిమగ్నమయినాడు అతనలా సమాధిలో ఆరు పగళ్లు, ఆరు రాత్రులు వున్నాడు అతనాత్మానందమునుభవించి, జీవన్ముక్తుడయినాడు, అతను సుఖదుఃఖాలు, రాగ ద్వేషములు, నిందాస్తుతులు, శీతోష్ణములు మున్నగు ద్వంద్వాలన్నిటి కతీతుడుగా జనన, మరణ చక్రము నుండి, విముక్తుడైనాడు."

ఇప్పడు తను విదేహ ముక్తి స్థితిని చేరుకోవాలనుకొన్నాడు, అతనొక పర్వత గుహలోకి వెళ్ళి, పద్మాసనాశీనుడై, తనలో తనిలా అనుకొన్నాడు "ఓ కోరికలా! మీకు నేను వీడ్కోలు చెప్తాను. మీ ద్వారా, నేను భౌతిక సుఖాలననుభవించాను, ఇప్పడు నేను నిష్కాముడనై, శాంతిని పుష్కళంగా పొందుతున్నాను. ఓ కోపమా! నీవు నన్ను దుర్మార్గుల నుండి రక్షించుకోవటానికి సహాయము చేశావు, ఇప్పడు నేను మనశ్శాంతిని పొంది, నీకు వీడ్కోలు చెప్తున్నాను, నీ జిత్తుల మారితనాన్ని నేను తెలుసుకొన్నాను."

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

జనవరి 2017

01 ఆది : ఆంగ్ల సంవత్సరాది, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

08 ఆది : ముక్కోటి ఏకాదశి. శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

12 గురు : పౌర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ.

13 శుక్ర : భోగి పండుగ, శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపళ్ళు

14 శని : మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, శ్రీ సద్గరు పాద పూజ, భక్త సమారాధన.

15 ఆది : కనుమ

22 ఆది : శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

26 గురు : మాస శివరాత్రి, రిపబ్లిక్ డే, పావులూరులో ఏకాహం

27 శుక్ర : అమావాస్య.

ఫిబ్రవరి 2017

07 మంగ : భీష్మ ఏకాదశి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

10 శుక్ర మాఘ పౌర్ణమి- సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

21 మంగ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

25 శని : మహాశివరాత్రి - తె॥జా 3గం.లకు బృందావనంలో శ్రీ సద్గురుదేవులకు నమకచమక సహిత అభిషేకం; 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; అనంతరం శ్రీరామలింగేశ్వర స్వామికి సామూహిక ఏకాదశ రుద్రాభిషేకాలు; 11గం.లకు శ్రీరామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం; లక్షబిల్వార్చన; భక్తసమారాధన. సాయంత్రం 6-30ని॥లకు శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.పావులూరులో ఏకాహం

26 : ఆది : అమావాస్య

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

శ్రీగురుదేవులు తత్త్వబోధ చేస్తూ ఉండగానే దేవతలను గురించి చర్చ వచ్చింది. భక్తులంతా ఎవరికి తోచింది వారు స్వేచ్ఛగా వ్యక్తం చేయటం



మొదలుపెట్టారు. శ్రీగురు దేవులు జోక్యం చేసుకుని మాట్లాడుతూ "పూర్వ కాలం గురువులు చెప్పినట్లు శిష్యులు నడుచుకునేవారు. రోజులు మారిపోయాయి. ఇప్పుడు శిష్యులు చెప్పినట్లు గురువులు నడుచుకో వలసిన పరిస్థితి వచ్చింది. ఆత్మవిచారణ చేసే సాధకుడు దేవతల ఆరాధన, అర్చన, కీర్తన చేయవలసిన అవసరం ఏమిటి? అని కదా మీ అందరి సందేహం.

సందేహం కలగటంలో తప్పులేదు. కానీ ఆ సందేహాన్ని గురుదేవులకు నివేదించి, సందేహ నివృత్తి చేసుకోవాలి. అది సరియైన విధానం. దానికి భిన్నంగా ప్రవర్తించిన సాధకునికి రజ్జును చూసి సర్పమని భ్రాంతిచెందినట్లు దేశకాలనామ రూపాలతో కూడిన ప్రపంచంలో వస్తువులన్నీ పరిచ్ఛిన్నంగా గోచరిస్తాయి. అంతేకాని నిరాకారమైన ఆత్మవస్తువు ఇంద్రియాలకి, మనస్సుకి అందుతుందా? తత్త్వం తెలుసుకోవాలి. ఆత్మవిచారణ చేయాలి అనే ఇచ్ఛకలగాలి కదా! దానినే శుభేచ్ఛ అంటారు. అప్పుడు కదా సాధన ఫలించేది.

సాధకునిలో సంస్కారహీనత ఆత్మవిచారణ చేయటానికి మనస్సుని అనుమతిస్తుందా! మనస్సు విషయాదులపై పరుగు పెడుతుంది. అందువల్ల దేవతల అర్చన, ఉపాసన, కీర్తన చేయటం ద్వారా తత్త్వ విచారణ చేయాలనే ఇచ్ఛ కలుగుతుంది.

మానవుల కర్మానుష్ఠానమే దేవతలకు ఆహారం. దేవతలు అధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆదిదైవిక రూపాలలో సంస్థితమై ఉండి, మానవుల సాధనకు దోహదం చేస్తారు. మానవుల అంగాలలో సంస్థితమైన దేవతా

రూపం అద్యాత్మికం. సృష్టిలో ఉన్న వస్తువులు, పదార్థాలలో సంస్థితమైన దేవతా రూపాలే ఆదిభౌతికం. దేవతా లోకంలో శరీర ధారణ చేసి ఉన్న రూపమే ఆదిదైవికం.

నేను నేను అనే అహమహం భావన అంతఃస్ఫురంతం అంటే మనలోనే ఉంది సుమా! అని. బాల్యం, యవ్వనం, కౌమార్యం, వృద్ధాప్యం దశలలోగాని, జాగృత, స్వప్న, సుషుప్తి అవస్థలలోగాని, మారేది కాదు. అది పరిణామ రహితమైనది.

దశలు, అవస్థలు మారతాయి. ఒక దశ నుండి వేరొక దశకు చేరినా, ఒక అవస్థ నుండి వేరొక అవస్థకు మారినా పూర్వపు దశ, అవస్థ లక్షణాలు ఉండవు. అదృశ్యమవుతాయి. అందువలననే దశలు, అవస్థలు మారేవి వాటిని వావృత్తి అంటారు.

మారని నేను అనే స్వరణ (అహమితి) మనతోనే ఉంటుంది. అది అనువర్తమానమితి. మనం పుట్టినది మొదలు దేహత్యాగము చేసేవరకు గల నేను అనే స్ఫురణ కలగటమే ప్రత్యభిజ్ఞత. అదే ముక్తి లేక మోక్షస్థితి.

దేహత్యాగం చేసిన తరువాత 'నేను' ఉన్నానా అనే సందేహం కలుగవచ్చు. అది ఆ స్థితిలో ఉన్నవాడికి గోచరమేగాని, అన్యులకు సాధ్యమయ్యేది కాదు. అయితే దాన్ని గుర్తించేవాడున్నాడు. అదే నేను. అది అవినాశి.

అందువలన ఆత్మదర్శనం పొందిన తరువాత అనాత్మ వస్తువు గోచరించదు. సర్ప భ్రాంతి తొలగిపోతుంది. ఆత్మానుభూతి పొందాను అనటం యదార్థం కాదేమో. అది అనుక్షణము, నిత్యమూ అనుభవించేది. అది పొందటమూ, పొందకపోవటమూ అనేది ఉంటుందా! అది ప్రత్యభిజ్ఞత. అది అనువృత్తి. శాశ్వతమైనది. మారనిది పరిణామం లేనిది" అన్నారు సద్గురుదేవులు.

# ధాధ్యాస ధ్యానము

- రమణ ప్రసాద్

అష్టాంగ యోగం (రాజయోగం) -ఎనిమిది అంగాలు - యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ధారణ, ధ్యాన, సమాధి. ఇందులో మొదటి అయిదు అంగాలు మనస్సును స్థిర స్థితిలో ఉంచటానికి వుపయోగ పడతాయి. మిగిలిన మూడు అంగాలు - ధారణ, ధ్యాన, సమాధులు మనస్సును అంతర్ముఖం చేస్తాయి. మనస్సులో జ్ఞాన ప్రకాశాన్ని (ప్రజ్ఞ)ను ఉదయింప జేసి మనస్సు ధ్యేయ వస్తువులో లయమయేటట్లు చేస్తాయి.



ఒక వస్తువుపైన మనస్సును ఏకాగ్రం చేయటం ధారణ.

ధ్యేయ వస్తువుపైన మనస్సును స్థిరంగా చాలాసేపు నిలపటం ధ్యానం.

ధ్యేయం వస్తువులో మనస్స లయమవటం. అక్కడ అన్ని రూపాలు పోయిన భావాతీత స్థితే సమాధి స్థితి. నిస్సంకల్ప సమాధిని నిర్బీజ సమాధి అని కూడా అంటారు.

ధారణ, ధ్యాన, సమాధులు - ఈ మూడు కలిపి చేసేదే సంయమ ధ్యానం. అదే ధాధ్యాస ధ్యానం అంటే. ఈ ధ్యానం వైరాగ్య స్థితికి తీసికొని వెళ్తుంది. అజ్ఞానం తొలగి జ్ఞానం ప్రకాశిస్తుంది. దానినే ప్రజ్ఞానం లేక చైతన్యం అంటారు.

శ్రీ గురుదేవులు “మనస్సు ఆత్మ వస్తువులో లయమై ఏ రకమైన అవరోధాలకు చలించకుండా అంతరాంతరాలకి చొచ్చుకుపోయి, శోధించి వెదుకగా, అచింత్యము, అవ్యక్తము,అదృష్టము, అగ్రాహ్యము, అవ్యవహార్యమైన ఆత్మ వస్తువులో లయించి “నేను” అనే అనుభూతి

మిగులుతుంది. అదే నీ యదార్థ స్థితి. అదే మోక్ష స్థితి. అక్కడ ద్వైతానికి, సంకల్ప వికల్పాలకు తావు లేదు. అదే ఆనంద స్థితి.

" ఆ స్థితిని పొందాలనేగా మీరు ధ్యానం చేసేది. మరి ఆనందం పొందితే ఎందుకు విరమిస్తున్నారు?

నీ మనస్సును ఆలోచింపజేసి, జ్ఞాన తేజస్సుతో ఆత్మానుభూతిని పొందాలి. దేహేంద్రియాలను అధిగమించి మనస్సును బుద్ధిలో లయం చేస్తే నిన్ను నీవుగా గుర్తించ గలుగుతావు" అని తెలిపారు.

ఈ విషయాన్నే పతంజలి యోగ సూత్రాలు తెలియజేస్తున్నాయి:

3.4 **త్రయమ్ ఏకత్ర సంయమః** - ధారణ, ధ్యానము, సమాధి కలిపి చేసే ప్రక్రియమే సంయమం .

3.5 **తద్ జయాత్ ప్రజ్ఞా లోకా**- సంయమాన్ని జయించినవాడు జ్ఞానంతో ప్రకాశిస్తాడు.

3.6 **తస్య భూమిషు వినియోగః** - సంయమాన్ని క్రమంగా సాధించాలి.

3.7 **త్రయమే అంతరంగం పూర్వేభ్యః** -మొదటి అయిదు అంగాలు బాహ్యమయినవి; ఈ మూడూ అంతరంగమైనవి.

3.8 **తదపి బహిరంగం నిర్బీజస్య**- నిర్బీజ సమాధి స్థితిలో ఈ మూడూ కూడా బాహ్యామై నీ మనస్సు ప్రజ్ఞ (చైతన్యం)లో లయిస్తుంది.

ద్రష్ట, దర్శన దృశ్యాది భావ శూన్యేక వస్తుని
నిర్వికారే నిరాకారే నిర్విశేషే భిదాకుతః (వివేక చూడామణి)

ద్రష్ట, దర్శనము, దృశ్యము అనే భావన లేక నిర్వికార, నిర్విశేషమైన వస్తువు(ప్రజ్ఞ)లే భేదమెక్కడిది?

సాధకుడైనవాడు ధారణ, ధ్యాన సమాధులను విడి విడిగా కాక ఒకే వస్తువుపై దృష్టి నిలిపి, దానినే ధ్యానం చేసి మనస్సును అందులోనే లయింప చేయాలి. ఇదే ధాధ్యాస ధ్యానము.

# అనింద్యునిపై గణపతి విజయం

(గత సంచిక తరువాయి) - రావి శోభ

మహాగణపతి మందహాసం చేసి, "విన్నావా మూషికాసురా? నిన్ను దండించక తప్పదు. నీ దండనకు నా దంతమే 'సరి'యైనది" అని, తన కుడివైపు దంతమును ఒక్క ఉదుట్న ఊడదీశాడు. మరుక్షణం ఆ దంతము అంతై! అంతంతై!! బ్రహ్మాండమంతైంది!!! అంతట త్రిలోకాలను చుట్టుముట్టిన ప్రళయాగ్ని యావత్తు ఒక్కసారిగా ఆకర్షింపబడి పెళపెళ మంటూ వచ్చి ఆ మహాదంతమందు ఐక్యమై పోయింది. అంత



మహాగణపతి పంచ ముఖాలతో, దశబాహువులతో మహారౌద్ర పూరితమైన విశ్వవిరాట్‌స్వరూపాన్ని ప్రదర్శించాడు. ఆ విశ్వవిరాట్ వీర భయంకర రౌద్రరూపాన్ని గాంచి త్రిలోకవాసులూ భయాందళోనలతో హా హా కారాలు చేస్తుంటే ఆ మహామూర్తిని శాంతింపజేయటానికి త్రిమూర్తులు, సప్తఋషులు, నారదాది దివ్య మహర్షులు స్తోత్రాలు శాంతి మంత్రాలు పఠించసాగారు.

"సమస్త దేవగణాలకు అధిపతివైన ఓ గణపతీ! నీవు మేధావులలో అగ్రగణ్యుడవు! శ్రేష్ఠుడవు! వేదనాయకుడవు! మా స్తుతులను మన్నించి, మా మొరలను ఆలకించి, మమ్ము రక్షించు! అనుగ్రహించు! ఓ మహాగణపతీ! మా నమస్కారములను స్వీకరించు" అని ఈ విధమైన స్తోత్రములను చేశారు. దానికి శాంతించిన మహా గణపతి తన విశ్వవిరాట్‌స్వరూపాన్ని ఉపసంహరించి, యధాపూర్వ స్థితిని పొందాడు. అనంతరం సమస్త లోకానికి అభయహస్తాన్ని ప్రసాదించి, "మదీయ దంతరాజమా! నీవు నీ కర్తవ్యాన్ని పాలించు" అని ఆజ్ఞాపించాడు. మరుక్షణం ఆ దంతరాజం నిప్పులు చెరుగుతూ మూషికాసురునిపైకి బయలుదేరింది.

మూషికాసురుడు చేష్టలుడిగి చూస్తుండగా, నారదుడు కల్పించుకుని "మూషికాసురా! దేవాదిదేవులకే అధినాయకుడైన వినాయక దేవునితోనే వైరం పెట్టుకున్నావు. ఇక త్రిలోకాలలో నిన్ను ఆదుకునేవారెవరు? ప్రాణభిక్ష పెట్టేవారెవరు?" అన్నాడు.

మూషికాసురుడు చప్పున రెండుచేతులు జోడించి, "అందరినీ రక్షించే ఈ గణపతి దేవుడే నాకు దిక్కు! జ్ఞానామృతపాన భాగ్యాన్ని కలిగించిన ఆ జగన్మాత నాకు దిక్కు!" అన్నాడు భక్తితో. మరుక్షణం మిరుమిట్లుగొలిపే దివ్యకాంతితో జగన్మాత అక్కడ ప్రత్యక్షమైంది. నిప్పులు గ్రక్కుతున్న దంతరాజమును వారిస్తూ, "విశ్వతేజోమయా! దాసుడి తప్పులు దండంతో సరి. నీ మహాదంత ప్రయోగాన్ని ఉపసంహరించుకో. నా భక్తుడైన యీ మూషికాసురుడను క్షమించు" అని జగన్మాత పలికింది. అప్పుడు మూషికాసురుడు కూడా చేతులు జోడించి "అవును దేవా! పూర్వజన్మ దుష్కృతం వల్ల నేను ఈ జన్మలో నీకు విరోధినయ్యాను. వినాయకా! ఈ అసురజన్మ నుండి నాకు విముక్తి కలిగించి, నన్ను నీలో ఐక్యం చేసుకో" అని ప్రార్థించాడు.

జగన్మాత మందహాసంతో "వినాయకా! ఈ మూషికుడు జ్ఞానామృత పానం చేత త్రిలోకపూజ్యత్వాన్ని సంపాదించాడు. ఈ మూషికానికి సహజసిద్ధమైన అష్టదుర్గుణాలను మునుపే నీవు స్వాధీనం చేసుకున్నావు. కనుక నిర్గుణుడయ్యాడు. ఇతనిని నీ వాహనంగా చేసుకో. ఒక మూషికాన్ని వాహనంగా చేసుకోవటం వల్ల బడుగుజీవుల పట్ల నీకున్న ప్రేమ లోకానికి వెల్లడి ఆవుతుంది. జ్ఞానామృత పానం వల్ల యీ మూషికానికి నీ వాహనంగా త్రిలోకపూజ్యత్వం లభిస్తుంది. నీవు 'మూషిక వాహనుడు'గా, 'ఏకదంతుడు'గా చిరకీర్తినందుతావు" అని తెలిపింది.

"ఈ 'మూషికవాహనుడి'ని భక్తిశ్రద్ధలతో పూజించినవారు ఇహమందు సర్వసుఖాలు అనుభవించి అంత్యమున మోక్షమును పొందారు" అని జగన్మాత మంగళాచరణం పలికింది.

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

ద్వితీయాశ్వాసము-2వ శ్లోకము -

వేణీమూలే విరచిత ఘనశ్యామ పింఛ్ఛావ చూడో
విద్యుల్లేఖా వలయిత ఇవ స్నిగ్ధ పీతామ్బరేణ
మామాలిఙ్గన మరకత మణి స్తంభ గమ్భీరబాహుః
స్వప్నదృష్ట స్తరుణ తులసీభూషణోనీలమేఘః॥

తాత్పర్యము -



కేశపాశమునందు నెమలిపురి చెరుపుకుని, మెరుపువన్నె పట్టుధోవతి గట్టి, తులసీపేరులుదాల్చి, టంద్రనీలమణి స్తంభములవంటి బాహుపురులుగల కృష్ణమేఘము లక్ష్మీసనాధుడై నా స్వప్నమున పొడ సూపెను.

సరిగా ఇక్కడే ఉన్న పొగడచెట్టు తిన్నె మీద కుర్చుని ఉన్నాను. యమునా నదికి నీళ్లకోసం వచ్చాను. నా తోడి గోపిక సరిత కొడుకు కూడా వచ్చాడు. వాడు నెమళ్లను తరుముతూ ఆడుకుంటున్నాడు. వాడిని చూస్తూ వాడిలో కన్నయ్యను ఊహించుకుంటున్నాను. కనులు మూసుకుని ధ్యానంలో మనస్సు నిలుపుకుంటున్నాను. ఇంతలో ఒక పల్లకి వచ్చి నా ముందు ఆగింది. చిత్రంగా కన్నయ్య స్వరం 'ఆ పల్లకీలో ఎక్కు' అని ఆజ్ఞాపించింది. నేను వెంటనే లేచి కళ్ళు తెరిచి, ఆ పల్లకీలో ఎక్కాను. అది ఆజ్ఞ! పల్లకీ ఆకాశ మార్గాన ఎక్కడెక్కడికో వెళ్ళి పోతోంది. నాకు తెలియదు ఎక్కడికో!

కొంచెం దూరం వెళ్ళాక అక్కడ పూలు పండ్లు సువాసనలీనుతున్న ఒక తోటలో ఆగింది. తోటలో ఒక రత్నాలమండంపం, అందులో ఒక నవ రత్న ఖచిత సింహాసనం, ఆ సింహాసనాధీశుడై కన్నయ్య! నా కళ్ళు వెడల్పు అయ్యాయి అది చూడగానే. ఆ పల్లకీ దిగి కన్నయ్య చెంతకు వెళ్ళాను. సింహాసనం మీద కన్నయ్య జుట్టుముడిలో ముదురు రంగు మేఘంలాంటి నెమలి పింఛము, దాని చుట్టూ జాజిపూలచెండు, ఆ ప్రక్కనే పచ్చలహారం వేలాడుతున్నది. యశోదమ్మ ఇంత బాగా ఎప్పుడు అలంకరించిందో అనుకున్నాను. పట్టుపంచ మేఘాలలో మెరుపుల్లాగా

మెరుస్తున్నాయి. అది ఒంటి మెరుపో, బట్టల సొగసో నాకు అర్థం కాలేదు. మరకతమణి స్తంభాల్లాంటి బాహువులతో శ్రీలక్ష్మీదేవిని కౌగలించుకుని ఉన్నాడు. ఆవిడ కన్నయ్య ఒడిలో ఒదిగి ఉన్నది. ఈ విధంగా కన్నయ్య లక్ష్మీనాధుడై నాకు దర్శనమిచ్చాడు.

"నా నిజ రూపాన్ని చూశావుగా. ఈ రూపాన్నే నీ మనస్సులో నిలుపుకో. ఇక ఆ పల్లకీ ఎక్కి వెనుతిరిగి వెళ్ళిపో" అన్నాడు కన్నయ్య. 'మరి నువ్వో?' అని అడిగాను. "నేనూ నీ వెనకాలే వస్తాను" అన్నాడు కన్నయ్య. అంతే. నేను పల్లకీ ఎక్కాను. వచ్చి ఇక్కడ దిగాను. నా కల చెదిరి పోయింది. ఇది కలా? నిజమా? అనుకుంటున్నాను.

ఇంతలో తోటి గోపికలు, ఆ వెనకాలే కన్నయ్య వచ్చారు. అదే రూపం, అదే ప్రకాశం నా మనస్సులో నిలిచిపోయిన ఆ దివ్యసౌందర్యం! కన్నయ్య నన్ను చూస్తూ "ఏమిటి అలా ఏదో కొత్తగా చూస్తున్నావు?" అన్నాడు. 'నిజమే ప్రభూ! నేను చూసినది నిజమేనా?' అని అడిగాను. మిగతా గోపికలకు మా మాటలు అర్థం కావటం లేదు.

అప్పుడు కన్నయ్య "ఇప్పుడు నువ్వు నిజం చూశావు. అశాశ్వతమైన ఈ జగత్తు మిథ్య. ఇప్పుడు నువ్వు చూసినది సత్యం. గ్రహించు" అన్నాడు. ఇలా నాకు అనుభవపూర్వకంగా పాఠం నేర్పిన సత్యగురువు కన్నయ్య!!

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

జనవరి 2017

12 గురు : పౌర్ణమ, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

13 శుక్ర : భోగి -రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాదపూజ, భోగిపళ్ళు.

14 శని : మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

22 ఆది : శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

ఫిబ్రవరి 2017

07 మంగ : భీష్మ ఏకాదశి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

10 శుక్ర మాఘ పౌర్ణమి- రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

21 మంగ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

25 శని : మహాశివరాత్రి - ఉదయం 5గం.లకు అభిషేకం; రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

(గత సంచిక తరువాయి)

# వసిష్ఠుడు

- రమణ ప్రసాద్

ఒకనాడు కన్యాకుబ్జాన్ని ఏలే గాధి రాజు పుత్రుడైన విశ్వామిత్రుడు వేటకై అడవికి వచ్చి తిరిగి, తిరిగి అలసిపోయి, వసిష్ఠమహర్షి ఆశ్రమానికి వచ్చాడు.ససైన్యుడై వచ్చిన విశ్వామిత్రుని ఆదరించి నందినీ ధేనువు మూలమున షడ్రసోపేతములతో విందు చేశాడు.



విశ్వామిత్రుడు నందినీ ప్రభావమునకు ఆశ్చర్యపడి,"మునీంద్రా! ఈ గోవును నాకు ఇవ్వండి. నేను నీకు లక్ష గోవులను, లక్ష మణులను, లక్ష గుఱ్ఱాలను ఇస్తాను. అన్నాడు. వసిష్ఠుడు, " రాజా! నేను పితృ దేవతల పూజాదికాలకోసం దీనిని ఉపయోగించుకుంటున్నాను. ఇది నీ కెందుకు? మాకు నీ సంపదలు ఎందుకు?'' అని నిరాకరించగా, విశ్వామిత్రుడు వసిష్ఠునిపై యుద్ధానికి వచ్చి, దివ్యాస్త్రాలను ప్రయోగించాడు. వసిష్ఠుడు తన బ్రహ్మ దండాన్ని అడ్డు పెట్టాడు. ఆ దండం విశ్వామిత్రుని శస్త్రాలన్నీ ఖండించింది. గాధి సుతుడు అవమానితుడై వెళ్లిపోయాడు.

విశ్వామిత్రుడు పంపగా వచ్చిన రాక్షసుడు శక్తి మొదలైన నూర్గురు పుత్రులను చంపాడు. తాను వారి మరణాన్ని తప్పించగలిగినా ఆత్మజ్ఞాని అవటం చేత ప్రతీకారం చేయకుండా ఉన్నాడు. పంచ భూతాలు తన పట్ల ఎలా ప్రవర్తిస్తాయో పరీక్షించటానికి మరణోద్యుక్తుడై దావాగ్ని లో ప్రవేశించగా,ఆ క్షణంలోనే దావాగ్ని చల్లారిపోయింది. తర్వాత వసిష్ఠుడు మెడకు రాయి కట్టుకుని సముద్రంలో దిగాడు. సముద్రుడు తన తరంగ హస్తాలతో తీరానికి చేర్చాడు. పర్వత శిఖరం నుంచి దూకగా అతని శరీరం దూదిపింజ లాగా తేలికై భూమి మీదకు సురక్షితంగా చేరాడు. ఈ విధంగా పంచభూతాలు ఆతడు మరణించకుండా రక్షణ కల్పించాయి. పిమ్మట శక్తి భార్య గర్భం నుండి పరాశరుడు, అతనికి వేదవ్యాసుడు పుట్టబోతున్నారని తెలిసి తన మరణ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

శ్రీరాముని పూర్వజుడైన అనవరణ్యుడు దైవ ద్రోహం వలన కుష్టురోగపీడితుడు కాగా, వసిష్ఠ మహర్షి, అతనికి పశ్చాత్తాపము కలిగించి అతడిని రోగవిముక్తుడినిగా చేశాడు. అతని పుత్రి అయిన

శాంతను రోమపాదుడు పెంపునివ్వమని కోరగా అతడు మొదట అంగీకరింపలేదు. భవితవ్యాన్ని ఎరిగిన వసిష్ఠుడు, "దశరథునకు శాంత కారణంగా సంతానం కలుగుతుంది" అని చెప్పి ఒప్పించాడు. పరశు రాముడు క్షత్రియ సంహారం చేస్తూ, దశరథుని చంపరాగా, దశరథుని కాపాడి శాంతను పరశురామునికిచ్చి వివాహం చేయించాడు. పుత్రార్థం పుత్ర కామేష్టి యాగం చేయమని వసిష్ఠుడే దశరథుని ఆదేశించాడు. తత్ఫలితంగా శ్రీరామాదులు జన్మించారు. వారికి జాత కర్మలు చేయించి నామకరణం చేశాడు. దశరథుడు చనిపోయిన తరువాత భరత, శత్రుఘ్నులను రాజ్యాన్ని ఏలమని చెప్పాడు. శివ దనుర్భంగం చేసి శ్రీరాముడు సీతను పెళ్ళి యాడగా, లక్ష్మణునికి ఊర్మిళను, కుశధ్వజుని కూతుళ్ళను భరత శత్రుఘ్నులకి ఇప్పించి వసిష్ఠుడే వివాహాలు చేయించాడు. ఈ విధంగా ఆయన అనేక విషయాలలో తోడ్పడి రఘు వంశాన్ని ఉద్ధరించిన మహానుభావుడు.

సర్వ సంపదలతో తులతూగే మాంధాత చక్రవర్తిని అభినందించటానికి వసిష్ఠాదులు వచ్చారు. మాంధాత వారిని గౌరవించి రత్న సింహాసనాలపై కూర్చుండ జేసి భార్యతో వారికి శుశ్రూషలు చేయించాడు. మాంధాత ఋషి తిలకుడైన వసిష్ఠుని వలన తన పూర్వ వృత్తాంతాన్ని తెలుసుకొని, తనకు జ్ఞానం తెలిపి తరింపచేయమని ప్రార్థించాడు. వసిష్ఠుడు అతనిని కరుణించి, కర్మ స్వరూపమును, వేద వేదాంత స్వరూపమును, ఉపాసక స్వరూపమును, భగవదవతార రహస్యాన్ని బోధించాడు. ఈ విధంగా మాంధాత ఆ మహనీయుని బోధ వలన జ్ఞానాన్ని పొందిన తరువాత వసిష్ఠుడు అతనికి అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించి కటాక్షించాడు.

వసిష్ఠ మహర్షి స్మృతి కర్తలలో ఒకడు. వసిష్ఠ స్మృతిని " వసిష్ఠ ధర్మ సూత్రములు" అని అంటారు. వసిష్ఠుడు యోగవాసిష్ఠ ము,జ్ఞానవాసిష్ఠము, జ్యోతిర్వాసిష్ఠము అనే గ్రంథాలను రచించాడు.

బ్రహ్మ తేజో బలంబు రూపము ధరించి
పరమ పావన భారత వర్షమందు
వెలసెను వసిష్ఠుఁడన భువి వెలిఁగి యదియె
సప్తఋషి మండలముఁ జొచ్చె శాశ్వతముగ ॥

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)  - విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

శ్రీబాబు సామాన్యంగా సినిమాలకు వెళ్ళటానికి ఒప్పుకునేవారు కాదు; కాని భక్తుల చరిత్రలు తెలిపే సినిమాలు, మంచి నీతిని, ఉత్తమ ధర్మాన్ని, ప్రబోధించే సినిమాలు ఏవైనా వస్తే వెళ్ళవద్దనేవారు కాదు. ఒక్కొక్కసారి తాము కూడ వచ్చేవారు. చూచి వచ్చిన తరువాత తప్పనిసరిగా, ఆ సినిమానుండి తెలుసుకోదగిన సద్విషయాలు ఏమున్నాయో అందరి చేత చెప్పించి, చివరకు అందులోని ప్రయోజనకరమైన పరమార్థాన్ని తానే వివరించేవారు.



ఒకరోజు ఉదయం శ్రీబాబు "మనమందరం కలిసి సరదాగా ఒక కూర చేసుకుందాము. ఎలా చేయాలో నేను చెబుతాను. ఇంట్లో ఏవేమి కూరగాయలు వున్నాయో పట్టుకొని రండి" అని తెప్పించి, అవన్నీ ముక్కలు కోయించారు. "బొగ్గుల కుంపటి మీద వంట మంచి రుచిగా ఉంటుంది. ఆరోగ్యానికి కూడా మంచిది" అని ఒక బొగ్గుల కుంపటి అంటించి తెప్పించారు.

తాము ఒక కుర్చీపీట వేసుకుని కూర్చుని శ్రీబాబు, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, ముక్కలుగా తరిగించి, ఆ ముక్కలు, తరిగిన కూరముక్కలు, అన్నీ ఒక పెద్ద కూర గిన్నెలో పోయించి, తగినంత ఉప్పు, పొడికారము వేయించి, కొంచెం నూనె వాటిపైన వేయించి, మొత్తం శుభ్రంగా కలిసేట్లుగా కలిపించి, కొంచెం నీళ్ళుపోయించి మూతపెట్టి కుంపటిమీద పెట్టించారు. కొంచెం చింతపండు నాన బెట్టించారు. కూరముక్కలు ఉడికిన తర్వాత,చింతపండు పిసికి, ఆ రసం కూడా అందులో పోయించారు.

అవన్నీ ఉడుకుతుంటే శ్రీబాబు "ఇప్పుడు యిందులో మనం వుడకబెడుతున్నవన్నీ మనలోని గుణాలు, సంకల్పాలు. అవన్నీ ధ్యానాగ్నిలో

బాగా పచనమైనపుడు, ఉప్పు, కారము, పులుపు వంటి ఈర్ష్య, అసూయ, అహంకారము, క్రోధము మొదలైన రుచులు, వేరు వేరు కూరల వంటి మానవుల భిన్న స్వభావములు అన్నీ కలిసిపోయి ఒక్కటై, అమృతత్వాన్ని పొందుతాయి. ఆ పదార్థాన్ని మనం జగన్మాతకు నివేదన చేస్తే, అది మహా ప్రసాదమవుతుంది. ఇక దీనిలో వేరే తిరగమూత, మసాలాలు వంటి ప్రపంచవాసనలు కలవవు. ఈ ప్రసాదం తీసుకుంటే , మానవునిలోని వికారగుణాలు, నీచభావాలు అన్నీ హరించి, శుద్ధ సత్త్వస్వరూపుడై ప్రకాశిస్తాడు. రుచులమీది భ్రాంతిని తొలగించి, యిది ఆశ్రమముగానే ఆధ్యాత్మిక సాధనకు ఎంతో దోహదపడుతుంది. అందుకే దీనిని శ్రమ లేకుండా చేసుకునే **'ఆశ్రమం కూర'** అంటారు. ఇంటిపనులు చేసుకుంటున్నా, కూరలు తరుగుతున్నా , వంట చేస్తున్నా, భగవన్నామం చేసుకుంటూ గనక చేస్తే ,అది మనస్సుకు ఎంతో ప్రశాంతతని, పవిత్రతను కలిగిస్తుంద"న్నారు శ్రీబాబు.

పోతునూరు నుంచి కవిగారి కుటుంబము, రాఘవరావుగారి దంపతులు శ్రీదేవీశరన్నవరాత్రి పూజలకు ప్రతి సంవత్సరము గుండుగొలనుకు వెళ్ళి వస్తూ ఉండేవారు. నవరాత్రి పూజలు పోతునూరులో తమ యింట్లో జరపమని రాఘవరావుగారు శ్రీబాబును ప్రార్థించారు, వారు అంగీకరించారు.

1955లో మొదటిసారిగా శ్రీబాబు రాఘవరావుగారింట్లో జగన్మాత పూజాపీఠమును ప్రతిష్ఠించి, ఆశ్వయుజ శుద్ధ పాడ్యమినాడు శ్రీదేవీ శరన్నవరాత్రి పూజలు ప్రారంభించారు. ఆ రోజులలో పూజామందిరమును శ్రీబాబు తామే స్వయంగా అలంకారం చేసుకునేవారు. వేణమ్మ, ఆమెతోబాటు ఒకరిద్దరు ప్రక్కన ఉండి, అడిగినవన్నీ శ్రీబాబుకు అందిస్తూ ఉండేవారు.

పూజలు ప్రారంభించే రోజున పూజామందిరం అలంకరించే సమయంలో జరిగిన ఒక సన్నివేశం ద్వారా శ్రీబాబు , భగవంతునికి పూజ, సేవ చేసుకునే సమయంలో భక్తుడు ఎంత సర్వసమర్పణ భావంతో, నిండు మనస్సుతో,భక్తి ప్రపత్తులతో ఉండాలో తెలియజేశారు.

- సశేషం

విష్ణు  కథలు

# మీరాబాయి

- రమణ ప్రసాద్

రాజస్థాన్‌లోని మేవాడ్ రాజ్యానికి చెందిన సాంగా పరివారంలోని వారు మనదేశ గౌరవాన్ని, ఖ్యాతిని, స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి ఎంతో శౌర్య సాహసాలు ప్రదర్శించారు. ఆ పరివారానికి చెందిన మీరా నుండి ఒక భక్తి ప్రవాహం ప్రారంభమై దాని భక్తి తరంగాలు నలుదిశలా వ్యాపించాయి.



ఉదయపూర్ రాజు రతన్ సింగ్ పరమ ధార్మికుడు. సత్యశీలుడు. అతడు ధర్మం తప్పక పరిపాలన చేస్తున్నాడు. అతనికి భగవత్కృపచేత ఒక పుత్రిక కలిగింది. ఆమెకు మీరాబాయి అని నామకరణం చేశారు. ఆమె 1498లో జన్మించినట్లు చెబుతారు.

మీరాకు నాలుగేళ్ళ వయస్సులో ఒక సాధువు కృష్ణ విగ్రహాన్ని ఎంతో ప్రీతితో పూజించటం చూసి వెంటనే ఆ సాధువును సమీపించి, “ఈ కృష్ణ విగ్రహం నాది. నీదికాదు. ఈ విగ్రహం నాదైపోయింది. నాది నాకు ఇచ్చెయ్యి” అని మారాం చేసింది. ఆ సాధువు, “నువ్వు పెద్ద దానివి అయితే ఇది నీకు దొరుకుతుంది” అని సముదాయించాడు. మీరా ఊరుకోక ఆ సాధువుతో, “ఆ మూర్తిని నాకు ఇచ్చెయ్యవా? నేను నీకుమల్లేనే ఈ మూర్తిని పూజిస్తాను. ఇన్నాళ్ళూ నువ్వు ఆరాధించావు. ఇంక నేను ఆరాధిస్తాను” అంది. కాని ఆ సాధువు ఇవ్వలేదు. వేరే గ్రామానికి వెళ్ళాక అతనికి “అయ్యో! ఆ చిన్నపిల్ల విగ్రహం ఇవ్వమని మరీ మరీ అడిగిందే, నేను ఇచ్చి ఉండాల్సిందేమో”అన్న ఆలోచన వచ్చింది. కాని ఆ పసిపిల్ల ఈ విగ్రహానికి పూజాదికాలు చేయలేదుకదా! అని తనకు తాను

సమాధానపరచుకున్నాడు. అయితే ఆరాత్రి, సాధువుకు కృష్ణ భగవానుడు కనిపించి "నువ్వు ఏది సాధించాలో అది సాధించావు. నువ్వు ఏ స్థితిని పొందాలో ఆ స్థితిని పొందావు. నువ్వు ఇక ఈ మూర్తిని వదిలిపెట్టు. ఇది ఇక నీదికాదు. నిన్ను ఎవరైతే అంతగా అర్థించారో వారిదైనది. వెళ్ళి ఆమెకు ఇచ్చిరా" అని అన్నాడు. సాధువు ఆ మర్నాడు వెళ్ళి ఆ చిన్నికృష్ణుడి మూర్తిని మీరా చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. ప్రొద్దస్తమానం మీరా కృష్ణుడిని ఎత్తుకు తిరిగేది. ఎప్పుడూ వదిలేదికాదు.

ఎనిమిదేళ్ళ ప్రాయంలో ఆడుకుంటున్న మీరా వీధిలో కదులుతున్న వివాహ ఉత్సవాన్ని చూస్తూ "అమ్మా! ఆ శబ్దం చేస్తూ వెళ్ళేవారు ఎవరు?" అని ప్రశ్నించింది. "భజంత్రీలు" అంది తల్లి.

వారి వెనుక ఉన్న ఆ ఇరువురు ఎవరు? అన్నది. అందుకు "నూతన దంపతులు" అన్నది తల్లి.

"అంటే" అని అడిగింది.

"కొత్తగా వివాహమైనవారు" అని తల్లి జవాబు ఇచ్చింది.

"అమ్మా! వివాహం అంటే ఏమిటి? మళ్ళీ ప్రశ్నించింది. అందులకు "వివాహం ఒక పవిత్ర బంధం. భగవంతుని చేరేందుకు స్త్రీ పురుషుల మధ్య ఏర్పడిన అనురాగ స్పందనం. ముఖ్యంగా స్త్రీకి భగవానుడు ఒసగిని వరం" అని తెలియజేసింది తల్లి.

"అమ్మా! నాకు ఎప్పుడు వివాహం అవుతుంది? నా భర్త ఎవరు?" అని తల్లి వంక సూటిగా చూసింది. ఆ బిడ్డ ప్రశ్నకు ఎలా సమాధానమివ్వాలో తెలియక కొన్ని క్షణాలు తికమకపడి ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని చూపించి "అదిగో అటు చూడు ఆ కృష్ణుడే నీ భర్త" అని చెప్పి ప్రక్కగదిలోకి వెళ్ళింది.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL